సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
గురువారం, 12.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 140
పేజీలు: 12 వెల: రూ. 5

## తెలంగాణ-ఏపీల మధ్య హైటెక్ ప్రయాణం

### ఖమ్మం-దేవరపల్లి మధ్య 162 కి.మీ గ్రీన్ ఫీల్డ్ కారిడార్ నిర్మాణం పూర్తి దశకు

- హైదరాబాద్-విశాఖ ప్రయాణ సుమారు 80 కి.మీ వరకు తగ్గే అవకాశం
- రూ.4,451 కోట్ల వ్యయంతో నిర్మాణం భారత్‌మాల పథకంలో కీలక ప్రాజెక్టు
- 90 శాతం పనులు పూర్తి
- జూన్ నాటికి అందుబాటులోకి
- యాక్సెస్ కంట్రోల్ 4 లేన్ల ఎక్స్‌ప్రెస్ వే.. భవిష్యత్తులో ఆరు లేన్లకు విస్తరణ
- 10 ప్రధాన వంతెనలు, 295 కల్వర్టులు, 98 అండర్ పాసులతో హైటెక్ నిర్మాణం



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను అనుసంధానిస్తూ ఖమ్మం–దేవరపల్లి మధ్య నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే జూన్ నాటికి అందుబాటులోకి రానుంది. 162 కిలోమీటర్ల పొడవైన ఈ హైటెక్ రహదారి పనులు 90 శాతం పూర్తయ్యాయి. ఆధునిక సాంకేతికతతో రూపొందుతున్న ఈ ఎక్స్‌ప్రెస్ వే ద్వారా హైదరాబాద్ – విశాఖ మధ్య ప్రయాణ సమయం, దూరం గణనీయంగా తగ్గి రవాణా, వాణిజ్య రంగాలు బలోపేతం కానున్నాయి.

**కీలకంగా హైవే**

తెలంగాణ–ఏపీ మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవే అందుబాటులోకి రానుంది. ఖమ్మం నుంచి ఏపీలోని దేవరపల్లి వరకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ మిగతా 02లో


## తెలంగాణలో రైతు పవర్

### మూడో డిస్కం ఏర్పాటు.. ఉత్తర్వులు జారీ!

- వ్యవసాయ విద్యుత్ సరఫరా ప్రత్యేక పర్యవేక్షణకు కొత్త సంస్థ
- రైతులకు విద్యుత్ కనెక్షన్లు వేగంగా మంజూరు చేయడమే లక్ష్యం
- ఎత్తిపోతల ప్రాజెక్టులు, మిషన్ భగీరథకు విద్యుత్ సరఫరా బాధ్యతలు కొత్త డిస్కంకే

09

- సాధారణ వినియోగం.. వ్యవసాయ విద్యుత్ లోడును వేరు చేయాలని ప్రభుత్వ నిర్ణయం
- విద్యుత్ రంగంలో రాష్ట్ర విభజన తర్వాత అతిపెద్ద సంస్కరణగా భావిస్తున్న ప్రభుత్వం



తెలంగాణ విద్యుత్ రంగంలో చారిత్రాత్మక మార్పు! వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో, సాగునీటి ప్రాజెక్టులు మరియు రైతులకు ప్రత్యేక ప్రాధాన్యత నిస్తూ ప్రభుత్వం మూడవ విద్యుత్ పంపిణీ సంస్థను ('డిస్కం') ఏర్పాటు చేసింది. 'రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ' పేరుతో కొలువుదీరిన ఈ కొత్త సంస్థ, ఇకపై రాష్ట్రంలోని వ్యవసాయ కనెక్షన్లు మరియు భారీ ఎత్తిపోతల ప్రాజెక్టుల విద్యుత్ సరఫరాకు పూర్తి బాధ్యత వహించనుంది.



## స్పీకర్ తీర్పుపై హైకోర్టుకు వెళ్తాం

### కేంద్ర మంత్రి బండి సంజయ్

కాంగ్రెస్ కండువా కప్పుకొని పోటీ చేసినా స్పీకర్‌కు కనబడలేదా?

దానం, కడియంకు క్లీన్ చిట్ ఇవ్వడం దారుణం 03

# ఆల్ క్లియర్


### పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్

**తాజాగా దానం, కడియం శ్రీహరికి ఊరట**

- మొత్తం 10 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్
- సుప్రీంకోర్టుకు వెళ్లినా బీఆర్ఎస్ కు ఎదురుదెబ్బ
- ఎమ్మెల్యేలు ఇంకా బీఆర్ఎస్ వారేనని స్పీకర్ వ్యాఖ్య
- ఫిరాయింపుల వివాదంపై రాజకీయ వర్గాల్లో చర్చ
- స్పీకర్ నిర్ణయంపై మండిపడుతున్న బీఆర్ఎస్ నేతలు
- మళ్లీ న్యాయపోరాటానికి సిద్ధమవుతున్న గులాబీ పార్టీ

బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లు కొట్టివేత

బీఆర్ఎస్ ఆగ్రహం.. ఫలించని న్యాయ పోరాటం




**ముద్ర, తెలంగాణ బ్యూరో:** తమ పార్టీ నుంచి పోటీ చేసి.. గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారంటూ బీఆర్ఎస్ చేసిన పోరాటం వీగిపోయింది. వారంతా పార్టీ మారినట్లు సరైన ధృవీకరణ పత్రాలు సమర్పించలేదని, అవన్నీ రాజకీ య విమర్శలు అంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లను స్పీకర్ కొట్టేశారు. మిగతా 02లో



## స్పీకర్ నిర్ణయం చరిత్రలో చీకటి రోజు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అధికారంలో ఉన్న వారికి అనుకూల నిర్ణయాలని ఆరోపణలు 03



# గులాబీ దళమే బలం

### చీలిక తెచ్చి పాగా వేయడమే లక్ష్యం

### బీఆర్ఎస్‌ను మించి గ్రౌండ్ కోసం

- అదే పార్టీ మీదుగా కవిత దూకుడు
- క్యాడర్, లీడర్ కోసం ఇంటర్నల్ చర్చ
- కేటీఆర్ కు సవాల్ గా మారిన సోదరి
- గులాబీ నాయకత్వంపై కవిత మార్క్
- ఖమ్మం బాధితులకు కవిత ధీమా
- బీఆర్ఎస్ కంటే మైలేజ్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** సొంత పార్టీ ఏర్పాటుకు సిద్ధం అవుతున్న కవిత.. పాత బలం కోసం రాజకీయ వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఎక్కడైతే రాజకీయ నిరాదరణకు గురయ్యారో.. అక్కడే తన బలం చూపించాలని గులాబీ దళంపై ఫోకస్ చేస్తున్నారు. ఆనాటి టీఆర్ఎస్ కు జీవం పోసిన పాత నాయకులతో చర్చలు జరుపుతున్నారు. జాగృతి పేరుతో రాజకీయం చేయాలనుకుంటున్న కల్వకుంట్ల కవిత తనదైన శైలిలో రాజకీయ దూకుడు పెంచారు. బీఆర్ఎస్ పార్టీ కంటే వేగంగా ఆమె క్షేత్ర స్థాయి సమస్యలపై స్పందిస్తూ, ప్రజల్లోకి దూసుకుపోతున్నారు.

వారి బలహీనత.. ఇటు బలంగా..! తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఒక అనూహ్య మార్పు కనిపిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీ ప్రధాన నేతలు ఇంకా ప్రతిపక్ష పాత్ర పోషించడంలో కొంత తడబడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. తాము ఇంకా సమర్థవంతమైన ప్రతిపక్షంగా మారలేకపోతున్నాం అని గతంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. అయితే, సరిగ్గా ఇక్కడే కల్వకుంట్ల కవిత తనదైన శైలిలో రాజకీయ దూకుడు పెంచారు. బీఆర్ఎస్ పార్టీ కంటే వేగంగా ఆమె క్షేత్రస్థాయి సమస్యలపై స్పందిస్తూ, ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. మిగతా 02లో



## వేటాడి.. అలసి సొలసిన పులి

10

అడవికి రాజు.. ఆహారం దొరికే వరకు వేటగాడు.. కడుపు నిండితే మాత్రం సామాన్యుడికంటే సోమరి! అవును, మీరు విన్నది నిజమే. ఏపీలోని పోలవరం నియోజకవర్గం అడతీగల మండల పరిధిలో ఉన్న వీరభద్ర పురం గ్రామంలో వేటాడి ఆవు దూడను ఆరగించిన ఓ పెదపులి.. భుక్తాయాసంతో కదలలేక, మనుషుల్లాగే పచ్చికపై పొర్లుతూ చేసిన హంగామా ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

–ముద్ర డెస్క్ :

## గవర్నర్ ప్రమాణ స్వీకారం

### హాజరైన సీఎం, మంత్రులు, ప్రముఖులు



- ప్రమాణ స్వీకారం చేయించిన హైకోర్టు సీజే
- తెలుగులో ప్రమాణం చేసిన గవర్నర్

09

## మహిళా రిజర్వేషన్లకు ముహూర్తం ఫిక్స్?

### నియోజకవర్గాల పునర్విభజనకు ముందే అమలు



- బడ్జెట్ మలి విడత సమావేశాల్లోనే రిజర్వేషన్ల చట్టం
- సవరణ బిల్లుకు ఆమోదం తెలిపేందుకు కేంద్రం సన్నద్ధం
- అసెంబ్లీ, లోక్ సభల్లో పెరగనున్న మహిళా ప్రాతినిధ్యం

09

**తిరుమలగిరి సాగర్**

## తహశీల్దార్ పై అరెస్ట్ వారెంట్

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు 03

**భూ వివాదంపై ఫిర్యాదు.. విచారణకు సహకరించని ఎమ్మార్వో**

- కమిషన్ ఆదేశాలను లెక్కచేయని అధికారిపై కఠిన చర్యలు
- వెంటనే అరెస్ట్ చేసి కమిషన్ ముందుకు హాజరుపరచాలని పోలీసులకు ఆదేశం
- నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులకు హెచ్చరికగా నిలిచిన ఘటన

## ఎస్టీలకు మెజార్టీ డైరెక్టర్ పోస్టులు

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

- సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధనలో ఆదివాసీలు భాగస్వాములవ్వాలి

09




## వనం వీడిన బస్తర్ క్యాడర్

10

- లొంగిపోయిన 108 మంది స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు
- ఐదుగురు డివిజనల్ కమిటీ సభ్యులు, ఇద్దరు సీవైపీసీ కమాండర్లు
- రూ.3.61 కోట్ల లిక్విడ్ క్యాష్, కిలో బంగారం స్వాధీనం
- ఫలితమిస్తోన్న ఛత్తీస్ గఢ్ పూనా మార్గెమ్
- 26 నెలల్లో జనజీవనంలో కలిసిన 2,714 మంది మావోలు






## పేదలందరికీ సొంతిళ్లు

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- వెలుగుమట్ల నిర్వాసితులందరికీ న్యాయం
- ఇంటితో పాటు సౌకర్యాల కల్పన
- బాధితుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు
- డిసెంబర్ 9న గృహ ప్రవేశం

09




## పిల్లల్లో వెంట్రుకలు తెల్లబడకుండా



### పోషకాహారం

పిల్లల ఆహారంలో ఐరన్, కాల్షియం, ప్రోటీన్లు, విటమిన్B12 ఉండే ఆహారాలు (పాలు, గుడ్లు, పప్పులు, ఆకుకూరలు) తప్పనిసరిగా ఉండాలి. ఇవి జుట్టు ఆరోగ్యానికి చాలా అవసరం.

# ఆల్ క్లియర్




(మొదటి పేజీ తరువాయి)

10 మందిపై అనర్హత వేటు పడుతుందని, త్వర లోనే ఉప ఎన్నికలు వస్తాయని, మనమే గెలుస్తామని ధైర్యంతో పోరాటం చేసిన గులాబీ దళానికి ఓటమి తప్పలేదు. ఇక , తమకు అనుకూలంగా ఉన్న ఆ ఎమ్మెల్యే లను కాపాడుకోవడంలో అధికార కాంగ్రెస్ సక్సెస్ అ య్యింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి పార్టీ మారారని ఆరోపణలు ఎదుర్కొం టున్న ఎ మ్మెల్యేలకు క్లీన్ చిట్ లభించింది.

**అదంతా తప్పు**

గూడెం మహిపాల్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, అరికపూడి గాంధీ, బండ్ల కృష్ణ మోహన్, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య, సంజయ్ కుమార్ లకు ఇదివరకే స్పీకర్ గడ్డం ప్రసాద్ కు మార్ క్లీన్ చిట్ ఇచ్చారు. దానం నాగేం దర్, కడియం శ్రీహరిలపై విచారణ జరి పిన స్పీకర్ వీరిద్దరిపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. వీరు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారని నిరూపించడానిక సరైన ఆధారాలు లేవ ని, వారు సైతం బీఆర్ఎస్ ఎమ్మె ల్యేలే అని స్పష్టం చేశారు. స్పీకర్ నిర్ణయంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా మండిపడు తోంది. రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నా రని, తన హక్కులను స్పీకర్ దుర్వి నియోగం చేస్తున్నారని విమర్శించారు.

తాజాగా కడియం శ్రీహరి, దానం నాగేంద ర్ లపై పిటిషన్ కొట్టివేశారు.

తెలంగాణ రాజకీయాల్లో గత కొంతకాలం గా ఉత్కంఠ రేపుతున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల అంశంపై శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నా రు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరా రనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే లు దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివే శారు. ఈ నిర్ణయంతో పార్టీ మారారన్న ఆ రోపణలు ఎదుర్కొంటున్న ఇతర ఎమ్మెల్యే లకు కూడా ఊరట లభించినట్లయింది. ని బంధనల ప్రకారం ఫిర్యాదులు లేవని లేక పార్టీ మారారని నిరూపించేందుకు తగిన ఆ ధారాలు సమర్పించలేదనే కారణాలతో పిటి షన్లను స్పీకర్ తోసిపుచ్చినట్లు తెలుస్తోంది.

**సుప్రీంకోర్టు దాకా వెళ్లి..!**

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన వారిలో 10 మంది ఎమ్మెల్యేలు త దుపరి కాలంలో అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిపై చర్యలు తీసుకోవాలని బీఆ ర్ఎస్ నేతలు హైకోర్టును ఆశ్రయించగా, స్పీకర్‌కు నిర్ణీత గడువులోగా చర్యలు తీసు కోవాలని న్యాయస్థానం గతంలో సూచిం చింది. అయితే, తాజాగా స్పీకర్ ఇచ్చిన ఈ క్లీన్ చిట్ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో చర్చ నీయాంశంగా మారింది. ప్రతిపక్ష బీఆర్ఎ స్ ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ మళ్లీ న్యా యస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉంది.

**కాంగ్రెస్ గుర్తుపై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ..**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ పార్టీ గుర్తు మీద గెలిచిన మాజీ మంత్రి దానం నాగేంద ర్, తరువాత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి సికింద్రాబాద్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారని తెలిసిందే. ఓ సంద ర్భంలో తన రాజీనామా అంగీకరించాలని, దాంతో తనకు కాంగ్రెస్ లైన్ క్లియర్ అవు తుందని చెప్పారని ప్రచారం జరిగింది. దా నం సైతం అదేతీరుగా వ్యవహరించారు. కా నీ ఇటీవల రూటుమార్చిన దానం.. తాను బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నట్లు క్లారిటీ ఇచ్చారు.

**జీహెచ్ఎంసీ ఎన్నికలపై మాటలేంటి?**

త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి తాను కృషి చేస్తానని దానం చేసిన వ్యాఖ్యలు హాట్ టాపి క్‌గా మారాయి.. గ్రేటర్ హైదరాబాద్ వ్యా ప్తంగా ఉన్న 300 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ, ఎంఐఎం (MIM) పార్టీల తరపున ప్రచా రం చేస్తారని ప్రచారం జరిగింది. ఇతర ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నా రో తనకు తెలియదని, తాను మాత్రం కాం గ్రెస్ పార్టీలోనే ఉన్నానని చెప్పిన ఆయన తాజాగా మాట మార్చారు.

పార్టీకి వ్యతిరేకంగా తాను ఎప్పుడూ పనిచే యలేదని పేర్కొన్నారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, వ్యక్తిగత నిర్ణయాలతో కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశానన్నారు. కేసీఆర్, బీఆర్ఎస్ తనను ఎ ప్పుడూ వివరణ అడగలేదన్న దానం.. తనపై అనర్హత పిటిషన్ వేసిన వ్యక్తికి ఏం అర్హత, అధికారం ఉందని ప్రశ్నించారు.

## ఆమెకు కారుణ్య మరణం.. సుప్రీంకోర్టు

ముద్ర డెస్క్ :

కారుణ్య మరణాలు ఇటీవల పెరుగుతున్నాయి. కారణం ఏదైనా కారుణ్య మరణం కోసం కోర్టును ఆశ్రయిస్తున్నారు. విచారణ తర్వాత చాలా వరకు తిరస్కరణకు గురవుతున్నాయి. అయితే కొన్నింటిని మాత్రం కోర్టు కూడా అంగీకరిస్తోంది తాజాగా 13 ఏళ్లుగా కోమాలో ఉన్న 32 ఏళ్ల హరీశ్ రాణాకు సుప్రీంకోర్టు కారుణ్య మరణం అనుమతించడం భారత న్యాయ చరిత్రలో చారిత్రాత్మక సంఘటనగా నమోదైంది. అతడికి ప్రాణాధార చికిత్స వ్యవస్థ లను తొలగించడానికి సుప్రీం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం దేశంలో ఈ విధానానికి మొదటి సారి ఇచ్చిన అనుమతి.

**కారుణ్య మరణం పునాది**

15 ఏళ్ల ముందు 2011లో అరుణా షాన్‌బాగ్ కేసులో సుప్రీంకోర్టు పాసివ్ యూతనేషియా ను మొదటిసారి గుర్తించింది. మహారాష్ట్రలోని కింగ్ ఎడ్వర్డ్ ఆసుపత్రి నర్సుగా 1967లో చేరిన అరుణా (25 ఏళ్లు) 1973, నవంబర్ 27 రాత్రి వార్డుబాయ్ సోహన్లాల్ క్రూరంగా లైంగిక దాడికి గురైంది. గొలుసుతో బంధించి మెదడుకు గాయం చేయడంతో ఆమె కోమా లోకి వెళ్లింది, మంచానికి పరిమితమై కేఎం ఆసుపత్రిలో ప్రత్యేక వార్డులో ఉంది.

అరుణకు కారుణ్య మరణం అనుమతించాలని జర్నలిస్ట్ పింకీ విరాణి సుప్రీంకోర్టులో 2011 లో పిటిషన్ దాఖలు చేసింది. కోర్టు చికిత్సను నిలిపివేసి సహజ మరణం (పాసివ్ యూతనే షియా) అనుమతించాలని నిర్ణయించింది, కానీ బాధితుడి తల్లిదండ్రులు, భాగస్వామి లేదా సన్నిహితుల అనుమతి తప్పనిసరిగా నిర్దేశించింది. 'నెక్సట్ ఫ్రెండ్'గా పింకీని నిరాకరించి, ఆసుపత్రి సిబ్బందిని సూరిగా నియమించింది, వారు చికిత్స నిలిపివేయడానికి ఒప్పుకోకపో వడంతో పిటిషన్ తిరస్కరించబడింది. నాలుగు దశాబ్దాలుగా జీవచ్ఛవం వల్ల ఉన్న అరుణా 2015లో న్యుమోనియాతో మరణించింది.

**హరీశ్ రాణా సందర్భం**

అరుణా కేసు ఆధారంగా 2018లో సుప్రీంకోర్టు 'గౌరవప్రద మరణం'ను ప్రాథమిక హక్కు గా గుర్తించి పాసివ్ యూతనేషియాను అధికారికంగా చట్టబద్ధం చేసింది. హరీశ్ రాణా (ఇంజినీరింగ్ విద్యార్థి) 2013లో చండీగఢ్ యూనివర్సిటీ హాస్టల్ నాలో అంతస్తు బాల్కనీ నుంచి పడిపోయి తలకు తీవ్ర గాయం కారణంగా 13 ఏళ్లు కోమాలో ఉన్నాడు. తల్లిదం డ్రులు సుప్రీంకోర్టుకు అనేక సంవత్సరాలు పిటిషన్ చేసిన తరువాత, వైద్య నివేదికల ఆధా రంగా మార్చి 2026లో చికిత్స తొలగించడానికి అనుమతించింది, ఇది అరుణా మార్గదర్శ కాల ప్రకారం మొదటి సారిగా ఇచ్చిన తీర్పు.

# గులాబీ దళమే కవిత బలం

(మొదటి పేజీ తరువాయి)

**వెలుగుమట్ల బాధితుల కోసం అనూహ్య ఉద్యమం**

ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్ల గ్రామంలో పేదల ఇళ్ల కూల్చివేతపై కవిత చేసిన పోరాటం రాజకీయ వర్గాల్లో ఆసక్తి కర చర్చకు కారణం అవుతోంది. నిరాశ్ర యులైన కుటుంబాల కోసం ఆమె ఏకంగా ఖమ్మం నడిబొడ్డున ఆమరణ నిరాహార దీక్ష కు దిగడం, పోలీసుల నిర్బంధాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడటం సోషల్ మీడి యాలో వైరల్‌గా మారింది. బీఆర్ఎస్ కేడ ర్ అంతా స్తబ్దుగా ఉన్న తరుణంలో, ఆమె నేరుగా గ్రౌండ్ లెవల్‌లోకి వెళ్లి బాధితులకు భరోసా ఇవ్వడం ద్వారా అటు పార్టీ శ్రేణు ల్లో, ఇటు ప్రజల్లో ఆమెపై సానుభూతి, మ ద్దతు పెరుగడానికి కారణం అయింది.

**లిక్కర్ కేసు నుంచి విముక్తి**

ఇటీవలే ఢిల్లీ లిక్కర్ కేసు నుండి విముక్తి పొందిన కవిత తెలంగాణ జాగృతి వేదిక గా తన రాజకీయ పునరాగమనాన్ని అత్యం త శక్తివంతంగా చాటుకుంటున్నారు. తన ను పార్టీ నుండి పంపేశారని చెబుతున్న ఆమె చేస్తున్న పోరాటాలు చూస్తుంటే.. బీఆ ర్ఎస్ చేయలేని పనిని ఆమె ఒంటిచేత్తో చే స్తున్నట్లు కనిపిస్తోంది. కేసీఆర్, కేటీఆర్ వంటి అగ్రనేతలు ఇంకా వ్యూహాల్లో నిమగ్న మై ఉండగా, కవిత మాత్రం నేరుగా యాక్ష న్‌లోకి దిగడం బీఆర్ఎస్‌కు షాక్ లాంటిదే. కవిత ఇప్పుడు తన 'తెలంగాణ ఉద్యమ కా లం' నాటి పంథాను మళ్లీ ఎంచుకున్నారు. అప్పట్లో జాగృతి ద్వారా ఎలాగైతే ప్రజలను సమీకరించారో, ఇప్పుడు కూడా అదే ఫా ర్ములాతో వెళ్తున్నారు. చట్టసభల్లో గొంతు క కంటే.. వీధుల్లో చేసే పోరాటమే బలంగా వినిపిస్తుంది అనే సిద్ధాంతాన్ని ఆమె పాటి స్తున్నారు.

**బీఆర్ఎస్ లీడర్, క్యాడర్ జాగృతి వైపు ఆకర్షితులవుతారా?**

జగదీష్ రెడ్డి చెప్పినట్లుగా పార్టీ ఇంకా ప్రతి పక్ష పాత్రకు అలవాటు పడకపోవచ్చు కానీ, కవిత మాత్రం ఇప్పటికే ఆ పాత్రలో ఒదిగిపోయారు. ప్రజా సమస్యలపై ఆమె చూపిస్తున్న ఈ తెగువ, కాంగ్రెస్ ప్రభుత్వం పై చేస్తున్న విమర్శలు ఆమెకు ప్రజల మద్ద తును మరింత పెంచుతున్నాయి. భవిష్యత్తు లో బీఆర్ఎస్ కేడర్ కూడా ఆమె నాయక త్వం వైపు మొగ్గు చూపినా ఆశ్చర్యపోవాల్సి న అవసరం లేదని చెబుతున్నారు. కేటీఆర్ కూడా వెంటనే.. ప్రెస్మీట్లు, సోషల్ మీడి యా విమర్శలకే పరిమితం కాకుడా.. ప్రత్య క్షంగా రాజకీయ యుద్ధాలకు దిగాలన్న అభిప్రాయం బీఆర్ఎస్ క్యాడర్ లో వినిపి స్తోంది.

**కవితకు పెరుగుతున్న క్రేజ్**

బీఆర్ఎస్ అగ్రనాయకత్వం కొంత మౌనం గా ఉన్న తరుణంలో కవిత మాత్రం రాజకీ యంగా దూసుకుపోతున్నారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో కోర్టు నుండి క్లీన్ చిట్ లభిం చిన తర్వాత, ఆమె మునుపటి కంటే రెట్టిం పు ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్తున్నారు. తాజా పరిణామాలు చూస్తుంటే కేటీఆర్, హరీష్ రావు వంటి నేతల కంటే కవితకే ప్ర జల నుండి అధిక మద్దతు లభిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**పోలీసుల నిర్బంధం.. కొనసాగిన దీక్ష**

మంగళవారం తెల్లవారుజామున పోలీసు లు కవితను దీక్షా స్థలి నుండి అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. శాంతి భద్రతల సమస్య సాకుతో ఆమెను హైదరా బాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న తెలం గాణ జాగృతి ప్రధాన కార్యాలయానికి తర లించారు. అయితే, పోలీసులు ఎంతగా అ డ్డుకున్నా తన పట్టు వీడలేదు. బాధిత కు టుంబాలకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రభు త్వం నుండి స్పష్టమైన హామీ వచ్చే వరకు తన నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతుం దని కవిత తేల్చిచెప్పారు. అక్కడే దీక్షను కొ నసాగిస్తూ ప్రభుత్వానికి సవాల్ విసిరారు.

**బీఆర్ఎస్ నాయకత్వానికి సవాల్‌గా మారిన కవిత చరిష్మా**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కేటీఆర్ ప్రస్తు తం కొంత లో-ప్రొఫైల్ మెయింటెన్ చే స్తుండగా, కవిత మాత్రం దూకుడుగా ముం దుకు వెళ్తుండటం ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆమె నేరుగా చేస్తున్న విమర్శలు, ముఖ్యంగా మహిళా ఓటర్లను ప్రభావితం చేసేలా ఆమె చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నా యి. బాధితులకు చేసిన అన్యాయానికి కాం గ్రెస్ ప్రభుత్వం మహిళల శాపనార్థాలను ఎదుర్కోక తప్పదని ఆమె హెచ్చరించారు. కవిత ప్రస్తుత దూకుడు చూస్తుంటే, రాబో యే రోజుల్లో బీఆర్ఎస్ రాజకీయాలకు ఆమె ప్రధాన ఆకర్షణగా మారే అవకాశం కనిపిస్తోంది.

**కేటీఆర్‌కు స్ట్రాంగ్ కౌంటర్**

ఇదిలా ఉంటే బీఆర్ఎస్ పార్టీకి కవిత కొర కరాని కొయ్యలా మారారు. త్వరలోనే కొత్త పార్టీని పెట్టబోతున్నట్లు తిరుమల వెంకన్న సాక్షిగా ఆమె చెప్పుకొచ్చారు. దీంతో బీఆ ర్ఎస్ అగ్రనాయకత్వంతో పాటు కార్యకర్త ల్లోను ఆందోళన నెలకొంది. ఇప్పటికే బీఆ ర్ఎస్‌లోని కొందరు ముఖ్య నేతలపై కవిత తుపాకీ ఎక్కుపెట్టారు. వారిపై విమర్శలు సంధిస్తూ వారికి నిద్ర లేకుండా చేస్తున్నా రు. ఇందుకు ఉదాహరణ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున తన అన్న కేటీ ఆర్ ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. మహి ళలు కేవలం ఒక తల్లిగానో, సోదరిగానో, కూతురు పాత్రల్లో మాత్రమే చూడకూడద ని, వ్యక్తిగతంగా సమాన హక్కులు ఉండేలా గౌరవించాలని అన్నారు. పురుషులు మహి ళలు సమాజంలో సమాన హక్కులు కలిగి ఉండాలని పేర్కొంటూ.. మహిళా సాధికా రతను ప్రోత్సహించాలంటూ చెప్పుకొచ్చా రు. కేటీఆర్ చేసిన ఈ ట్వీట్ పై నెట్టింట పెద్ద చర్చే జరిగింది.

కేటీఆర్ పోస్టు చేసిన వెంటనే కవిత మరో పోస్టుతో పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. ఇ తరులకు చెప్పేముందు మహిళలకు గౌర వం ఇవ్వాలన్నది ముందుగా ఇంటి నుంచే ప్రారంభం కావాలని ఘాటు కౌంటర్ ఇ చ్చారు. అంతేకాదు మహిళలు ఇంట్లోనే సో దరులనుంచి, తండ్రుల నుంచి, భర్తల నుం చి వివక్ష ఎదుర్కొంటున్నారని పేర్కొన్నా రు. ఇది కేటీఆర్‌కు ఇచ్చిన కౌంటరే అని విశ్లేషకులు భావిస్తున్నారు.



**ఖమ్మం పోరాటం.. కవిత దూకుడు**

ఖమ్మం శివార్లలోని వెలుగుమట్ల ప్రాం తంలో సుమారు 600 ఇళ్ల కూల్చివేత ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృ ష్టించింది. ఈ బాధితులకు అండగా నిలి చేందుకు కవిత నేరుగా క్షేత్రస్థాయిలోకి దిగి నిరసన చేపట్టారు. ఫిబ్రవరి 24న జరిగిన ఈ కూల్చివేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధితులకు న్యాయం చే యాలని డిమాండ్ చేస్తూ ఆమె ఖమ్మం లోని అంబేద్కర్ భవన్ వద్ద నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. ఈ ఒక్క పి లుపుతో రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ చర్చ మొదలైంది. పోలీసులు అడ్డుకున్నా, లాఠీలు చూపి బెదిరించినా వెనక్కి తగ్గ కుండా బాధితుల పక్షాన నిలబడటం కవి తలోని అసలైన పోరాట యోధురాలిని బయటకు తీసింది. అక్కడ ఆమె అరెస్ట్ అయిన తీరు, కార్యకర్తల్లో ఒక కొత్త ఊ పును తెచ్చింది. ప్రభుత్వ తీరును నిర సిస్తూ ఆమె చేపట్టిన ఈ దూకుడు వైఖరి ప్రజలను ఆకర్షించింది.

**కవితకు పెరుగుతున్న మద్దతు**

మరో వైపు సోషల్ మీడియాలో కవితకు గట్టి మద్దతు లభిస్తున్నట్లు కనిపిస్తోంది. కేసీఆర్ లాంటి ఉద్దండుడైన నాయకుడికి అసలైన రాజకీయ వారసురాలు కవితే అన్న చర్చ సోషల్ మీడియాలో జోరుగా నడు స్తోంది. కేసీఆర్ శైలిలోని మొండిత నం, సమయస్ఫూర్తి, ప్రజల సెంటిమెం ట్‌ను వాడటం వంటి లక్షణాలు కవితలో ఎక్కువగా కనిపిస్తాయని పలువురు పో స్టులు పెడుతున్నారు. దీనివల్లే కేటీఆర్ ఎంత గ్లామరస్ లీడర్ అయినప్పటికీ, పొలిటికల్ మైలేజ్ విషయంలో కవిత ముందు ఆయన 'తేలిపోతున్నారు' అనే డిస్కషన్ ఇప్పుడు ఊపందుకుంది. కేసీ ఆర్ రాజకీయ వారసుడిగా కేటీఆర్‌ను ప్రపంచం చూస్తుండవచ్చు, కానీ తెలం గాణ ప్రజలు మాత్రం కవితలో కేసీఆర్ నాటి ఉద్యమ స్ఫూర్తిని చూస్తున్నారు. ఖమ్మం పోరాటం తర్వాత తెలంగాణ ప్రజల్లో కవిత గ్రాఫ్ పెరిగిపోయింది.

## అమెరికా దురాక్రమణతో ప్రపంచ శాంతికి ముప్పు

### సీపీఐ జాతీయ నియంత్రణ కమిషన్ ఛైర్మన్ కె. నారాయణ

### ఇరాన్‌పై సైనిక దాడులు వెంటనే నిలిపివేయాలి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

అమెరికా ప్రభుత్వ దురాక్రమణ విధానాలు ప్రపంచ శాంతికి ముప్పు గా మారుతున్నాయని సీపీఐ జాతీయ నియంత్రణ కమిషన్ ఛైర్మన్ కె. నారాయణ ఆరోపించారు. ఇరాన్‌పై జరుగుతున్న సైనిక దాడుల ను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. యుద్ధంతో సాధారణ ప్రజలకే భారీ నష్టం, విధ్వంసం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సామ్రాజ్యవాద విధానాలను వ్యతిరేకిస్తున్న దేశాలు, ముఖ్యంగా రష్యా, చైనా ఐక్యంగా ముందుకు వచ్చి యుద్ధ పరిస్థితు లను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపుని చ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని మఖ్దూమ్ భవన్ లో జరుగు తున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం రెండవ రోజు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణా మాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. క్యూబా దేశం ఎదు ర్కొంటున్న తీవ్రమైన ఆర్థిక, ఆర్థిక సంక్షోభాన్ని వివరించిన ఆయన అమెరికా విధించిన దీర్ఘకాలిక ఆర్థిక నిర్బంధం, ప్రపంచ ఆర్థిక ఒత్తిళ్ల కారణంగా క్యూబా ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నప్పటికీ, అక్కడి ప్రజలు ధైర్యంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అంతర్జాతీయ రాజకీయ పరిస్థి తులపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలోని వివి ధ ప్రాంతాల్లో యుద్ధ వాతావరణం, ఉద్రిక్తతలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణ ఆసియా దేశాల్లో ప్రస్తుతం ముఖ్యమైన రాజకీ య, సామాజిక మార్పులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యం గా శ్రీలంకలో జరిగిన ప్రజా ఉద్యమంలో యువత చారిత్రాత్మక పాత్ర పోషించిందని చెప్పారు. ప్రజల ఐక్య పోరాటం ఎంతటి మార్పులను తీసుకురాగలదో అది చూపిందన్నారు. భారతదేశ రాజకీయ పరిస్థి తుల గురించి మాట్లాడుతూ కేరళలో జరగబోయే ఎన్నికలను ప్రస్తా వించారు. ప్రస్తుతం అక్కడ ఎల్‌డీఎఫ్ బలమైన స్థితిలో ఉందని, యూడీఎఫ్‌ను ఓడించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రజల సమ స్యలతో మమేకమై వామపక్ష ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సీపీఐని మరింత బలోపేతం చేయడానికి, సామూహిక పోరాటాలను విస్తరించడానికి, యువత, కార్మిక వర్గాలను పెద్ద ఎత్తున ఉద్యమాల్లోకి తీసుకురావాలన్నారు.

## తెలంగాణ-ఏపీల మధ్య హైటెక్ ప్రయాణం

(మొదటి పేజీ తరువాయి)

హైవే కారిడా ర్ రెండు తెలుగు రాష్ట్రా ల రవాణా ముఖచిత్రాన్ని మార్చబో తోంది. సుమారు 4,451.87 కోట్ల అంచనా వ్యయంతో, 162.4 కిలో మీటర్ల మేర నిర్మిస్తున్న ఈ హైటెక్ ర హదారి పనులు ప్రస్తుతం చివరి దశ కు చేరుకున్నాయి. తెలంగాణలో మొ ట్టమొదటి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేగా రికార్డు సృష్టించనున్న ఈ రహదారి.. జూన్ నాటికి వాహనదారులకు అం దుబాటులోకి వచ్చే ఛాన్స్ ఉంది.

**తగ్గనున్న దూరం**

కేంద్ర ప్రభుత్వం భారత్ మాల పరి యోజన పథకంలో భాగంగా నేషన ల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఈ గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రాజెక్టును పర్యవేక్షి స్తోంది. 2017లో ప్రతిపాదనలు సిద్ధం కాగా.. 2018లో కేంద్ర ప్రభు త్వం దీనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రహదారి అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులకు దూరం, ప్రయా ణ సమయం భారీగా తగ్గనుంది. ప్ర స్తుతం సూర్యాపేట, విజయవాడ మీ దుగా విశాఖకు వెళ్లాలంటే 676 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంది. కానీ, ఈ కొత్త కారిడార్ ద్వా రా 80 కి.మీ ఆదా కావటమే కాకుం డా ట్రాఫిక్ సమస్యలు లేకుండా వే గంగా గమ్యాన్ని చేరుకోవచ్చు.

ప్రస్తుతానికి గ్రీన్ ఫీల్డ్ హైవే కారిడార్ యాక్సెస్ కంట్రోల్ కలిగిన నాలుగు లైన్ల రహదారి. అయితే భవిష్యత్తు అవసరాల దృష్ట్యా దీనిని ఆరు లైన్లు గా విస్తరించుకునేలా డిజైన్ చేశారు. ఈ రహదారికి బారికేడింగ్ ఉండటం వల్ల ఇతర వాహనాలు మధ్యలో వచ్చే అవకాశం ఉండదు. ప్రతి 18 కిలో మీటర్లకు ఒక ఎంట్రీ, ఎగ్జిట్ పాయిం ట్లు, ప్రతి 5 కిలోమీటర్లకు అత్యవసర మీడియన్ ఓపెనింగ్స్ ఏర్పాటు చేశా రు. వాహనదారులు సాయం కోసం 1033 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్ర దించవచ్చు. మొత్తం మార్గంలో 10 ప్రధాన వంతెనలు, 295 కల్వర్టులు, 98 అండర్ పాసులు నిర్మిస్తున్నారు. ఏఐ సాంకేతికతో సీసీ కెమెరాలు ఏ ర్పాటు చేసి నిత్యం నిఘా పెడతారు.

**ఫైనాన్షియల్ గా ఖమ్మం**

ఈ గ్రీన్ ఫీల్డ్ రహదారి పూర్తిస్థాయి లో అందుబాటులోకి వస్తే ఖమ్మం జిల్లా ఆర్థికంగా అభివృద్ధి చెందనుం ది. ఖమ్మం రూరల్ మండలం తల్లం పాడు వద్ద ఈ హైవేకు ఎగ్జిట్ ఇచ్చా రు. దీనివల్ల స్థానిక రైతులకు, వ్యాపా రులకు తమ ఉత్పత్తులను వేగంగా మార్కెట్లకు తరలించే ఛాన్సుంది. హైవే పొడవునా గిడ్డంగులు, లాజిస్టి క్ హబ్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూని ట్లు ఏర్పాటు కావడానికి అవకాశం ఉంది. ఇప్పటికే 116 కిలోమీటర్ల మేర పనులు పూర్తి కాగా.. మిగిలిన 10-20 శాతం ఫినిషింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

సోలార్ వెలుగులతో, హైటెక్ హంగు లతో సిద్ధమవుతున్న ఈ కారిడార్ ఆంధ్ర-తెలంగాణ మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడమే కాకుండా.. సామాన్య వాహనదారులకు, ప్రయాణికులకు సుఖవంతమైన ప్రయాణాన్ని అందిం చేందుకు రెడీ అవుతోంది.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
12.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**పిల్లల్లో వెంట్రుకలు తెల్లబడకుండా చిట్కాలు**


**జంక్ ఫుడ్ తగ్గించాలి**

చిప్స్, ఫాస్ట్ ఫుడ్, కార్బొనేటెడ్ డ్రింక్స్ ఎక్కువగా తీసుకోవడం వల్ల పోషక లోపాలు వస్తాయి. ఇవి జుట్టు త్వరగా తెల్లబడే ప్రమా-దాన్ని పెంచుతాయి.



# ఆదేశాలు బేఖాతర్

- తిరుమలగిరి సాగర్ తహసీల్దార్ పై అరెస్ట్ వారెంట్
- రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సంచలన ఆదేశాలు
- భూ వివాదం కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు చర్యలు


TELANGANA HUMAN RIGHTS COMMISSION
GRUHAKALPA COMPLEX, MJ ROAD, HYDERABAD - 500001

HRC.No. 2313/2025

WARRANT OF ARREST

To
The Superintendent of Police,
Nalgonda District,
Telangana 508001.

Whereas, the Tahsildar, Tirumalagiri Sagar Mandal, has been duly issued repeated reminders and a conditional order dated 09.12.2025 to submit report before the Commission on 18.02.2026 at 11:00 AM, but has failed to submit report before the Commission on the said date and time.

You are hereby ordered to arrest and bring the said Tahsildar, Tirumalagiri Sagar Mandal, before this Commission on **13.04.2026** at **11:00 AM**. In the event of furnishing of sureties by the said individual to your satisfaction, no arrest is warranted.

You are further ordered to return this warrant on or before 13.04.2026 with an endorsement certifying the day on and the manner in which it has been executed, or the reason why it has not been executed.

Given under my hand and the seal of the Court.

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాజ్యాంగబద్ధమైన కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేసిన నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్ తహసీల్దార్ అనిల్ తీరుపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికార గర్వంతో విచక్షణ కోల్పోయి ఓ భూ వివాదం కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తహసీల్దార్ కు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని ఒక భూ వివాదంలో ఎమ్మార్వో అనిల్ అత్యుత్సాహం ప్రదర్శించారని.. బాధితుడి పట్ల పక్షపాతంగా, ఏకపక్షంగా వ్యవహరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మార్వో తీరుతో తీవ్ర అన్యాయానికి గురైన బాధితుడు, న్యాయం కోసం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన హెచ్ఆర్సీ, ఈ వివాదంపై సమగ్ర విచారణ జరిపి పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని గతంలోనే ఎమ్మార్వో అనిల్‌ను ఆదేశించింది. కమిషన్ ఆదేశాలను ఏమాత్రం లెక్కచేయని ఎమ్మార్వో, గడువు ముగిసినా నివేదికను సమర్పించకుండా కాలయాపన చేశారు. ప్రభుత్వ అధికారి అయి ఉండి, ఒక బాధ్యతాయుతమైన కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేయడంపై హెచ్ఆర్సీ తీవ్రంగా పరిగణించింది. తహసీల్దార్ అనిల్ నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషన్, చివరకు ఆయనపై అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. వెంటనే ఎమ్మార్వో అనిల్‌ను అరెస్ట్ చేసి తమ ముందు ప్రవేశపెట్టాలని పోలీసు శాఖకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇలాంటి కేసుల్లో వివరణ కోరడం పరిపాటి, కానీ నేరుగా ఒక ఎమ్మార్వోపై అరెస్ట్ వారెంట్ జారీ కావడంతో జిల్లా యంత్రాంగంలో ఒక్కసారిగా వణుకు మొదలైంది. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులకు ఈ ఘటన ఓ వార్నింగ్‌గా హెచ్చరికగా నిలుస్తుందని ప్రజలు భావిస్తున్నారు.

# మార్చి 13న జాబ్ మేళా

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**

డిజిటల్ ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్ డీఈఈటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ప్రముఖ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా ట్రాక్టర్ తయారీ యూనిట్, జహీరాబాద్ లో ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 13న ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి13, 2026 శుక్రవారం ఉదయం 09.00 గంటల నుండి సంగారెడ్డి జిల్లా ఇస్మాయిల్ ఖాన్ పేట్, హనుమాన్ నగర్ లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా 800కు పైగా ఖాళీలను ట్రెయినీ, అప్రెంటిస్ పోస్టుల ద్వారా భర్తీ చేయనున్నారని వెల్లడించారు. ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. అర్హత కలిగిన యువత తమ విద్యా ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, బయోడేటా, ఇతర అవసరమైన ధ్రువపత్రాలతో జాబ్ మేళాకు హాజరై ఉద్యోగ అవకాశాన్ని పొందాలని ఆయన కోరారు.

# హైకోర్టును ఆశ్రయిస్తాం..

- పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించేలా స్పీకర్ తీర్పు
- కాంగ్రెస్ కండువా కప్పుకుని పోటీ చేసినా స్పీకర్ కు కనబడలేదా..?
- దానం, కడియంకు క్లీన్ చిట్ ఇవ్వడం దారుణం
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాజ్యాంగ వ్యవస్థలను కాంగ్రెస్ తన కార్యాలయంలో బంధించాలని చూస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో విసిరేయాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి, కాంగ్రెస్ కండువా కప్పుకుని, ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసినా అనర్హత వేటు పడకపోవడం సిగ్గు చేటని సంజయ్ విమర్శించారు. గాంధీ భవన్‌లో ఉంటూ కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తున్నా వారు పార్టీ ఫిరాయించలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన విషయం నిజం కాదా? అని ఆయన ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ డిస్మిస్ చేయడాన్ని బండి సంజయ్ తప్పుబట్టారు. ఈ నిర్ణయం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అన్నారు. శాసన వ్యవస్థే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ తాము హైకోర్టును ఆశ్రయిస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు. 'న్యాయ వ్యవస్థపై మాకు పూర్తి నమ్మకం ఉంది. గతంలో బెంగాల్‌లో కూడా ఇలాంటి తీర్పు వస్తే అక్కడి హైకోర్టు మొట్టికాయలు వేసింది. తెలంగాణలోనూ ఫిరాయింపుదారులకు న్యాయస్థానం చెంప చెళ్లుమనేలా తీర్పు ఇస్తుందని ఆశిస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు. ఈ అప్రజాస్వామిక నిర్ణయాలపై ప్రజాస్వామ్య వాదులంతా నోరు విప్పాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ఎంపీ ఎన్నికల సమయంలో దానం కాంగ్రెస్ నుంచి పోటీ చేసినట్లు ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌లోని ఆధారాలను షేర్ చేశారు. 'కన్నతల్లే బిడ్డను చంపడం ఎంత పాపమో, రక్షించాల్సిన శాసన వ్యవస్థే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం అంతకంటే పెద్ద పాపం' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. స్పీకర్ తీర్పు ఫిరాయింపులను ప్రోత్సహించేలా ఉందని వ్యాఖ్యానించారు. శాసనసభ స్పీకర్ స్వతంత్రంగా వ్యవహరించాలి తప్ప, 'డూప్లికేట్ గాంధీ కుటుంబానికి' తాబేదారులా వ్యవహరించకూడదని బండి సంజయ్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

# స్పీకర్ నిర్ణయం చరిత్రలో చీకటి రోజు



- అధికారంలో ఉన్న వారికి అనుకూల నిర్ణయాలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెడిడెంట్ కేటీఆర్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెడిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇది కేవలం ఒక తీర్పు కాదనీ అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థలను ఉపయోగించే ఉదాహరణ అని చెప్పారు. బుధవారం మీడియాకు ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రజల ఓట్లతో గెలిచిన పదవులను వ్యక్తిగత లాభాల కోసం మార్చుకుంటే, స్పీకర్ దానికి ముద్ర వేస్తే.. ప్రజాస్వామ్య విలువలు ఎక్కడ నిలుస్తాయని ప్రశ్నించారు. ఇలాంటి నిర్ణయాలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్న కేటీఆర్.. సరైన సమయంలో సమాధానం చెబుతారని స్పష్టం చేశారు.

## సమావేశానికి ఎందుకు పిలవలేదు..? : దానం

ఈ అంశంపై దానం నాగేందర్ సైతం స్పందించారు. బీజేపీ, బీఆర్ఎస్, కేటీఆర్ లపై మండిపడ్డారు. ఈ నెల 10న జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశానికి తనను ఎందుకు పిలవలేదని నిలదీశారు. సీఎం కాలేదని కేసీఆర్‌కి ఇబ్బంది లేదన్న ఆయన ఆ పదవి పోయిందని కేటీఆర్ కి చాలా ఇబ్బంది పడుతున్నారని ఎద్దేవా చేశారు. లోక్ సభ ఎన్నికల్లో తన ఓటమికి కారణం బీజేపీ, బీఆర్ఎస్ అపవిత్ర కలయిక అన్నారు. తాను ఎంపీగా గెలిచి ఉంటే ఈ పంచాయతీ లేకపోయేదన్నారు. లోక్ సభ ఎన్నికల్లో తాను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేశానన్న దానం ఎక్కడా సభ్యత్వం తీసుకోలేదని స్పష్టం చేశారు. శాసనసభలో ఎక్కడా విప్ జారీ కాలేదనీ పార్టీకి వ్యతిరేకంగా ఎక్కడ పని చేయలేదని చెప్పారు. తాను యుద్ధంరంగం నుంచి వచ్చిన వాడినన్నారు. తనకు వ్యతిరేకంగా తీర్పు వచ్చినా ఉప ఎన్నికలకు వెళ్లి గెలిచే వాడినన్నారు. బీఆర్ఎస్ నేతలు తమ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనం కోసం సీఎం రేవంత్ రెడ్డిపై బురద చల్లుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి పదవి తమ ఆస్తి అని కొందరు అనుకుంటున్నారని కేటీఆర్‌ను ఉద్దేశించి చెప్పారు. రేవంత్ ముఖ్యమంత్రి కావడం ఏంటని కొందరు మదనపడుతున్నారు. ఎంత డీ మోరల్ చేసిన సీఎం డీ మోరల్ కాలేదన్నారు. ముఖ్యమంత్రి ఆశించినట్టే గ్రేటర్ ఎన్నికల ఫలితాలు ఉంటాయని వ్యాఖ్యానించారు.



# తూర్పు, ఉత్తర తెలంగాణకు ఎల్లో అలర్ట్

- ఈ నెల 15 నుంచి మూడు రోజుల పాటు వర్షా లు
- 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ చల్లటి కబురు వినిపించింది. ఈ నెల 15 నుంచి రాష్ట్రంలో దాదాపు 3 రోజుల పాటు మోస్తారు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మార్చి 14 వరకు ఎండలు ఇదే విధంగా ఉంటాయని తెలిపింది. 15 నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడతాయని వెల్లడించింది. ఆ సమయంలో కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 కిలోమీటర్ల నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులతో వీస్తాయని తెలిపింది. ఈ క్రమంలోనే ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు కురుస్తాయని వెల్లడించింది. రాష్ట్రంలోని నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం వంటి ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వర్షాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఆ జిల్లాలకు రాష్ట్ర వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ నెల 16, 17వ తేదీల్లో కూడా రాష్ట్రంలోని అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. దీంతో 3 రోజుల పాటు ఎండలకు బ్రేక్ పడి.. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయని వాతావరణ శాఖ అధికారులు భావిస్తున్నారు. అయితే ఈ ఆకస్మిక వర్షాలతో ఎండ వేడిమి నుంచి తాత్కాలికంగా ఉపశమనం లభించినప్పటికీ.. ఉరుములు, మెరుపులు ఉంటాయని.. ఆ సమయంలో ప్రజలు అలర్ట్‌గా ఉండాలని అధికారులు పేర్కొంటున్నారు. కాగా ఈ ఏడాది వేసవి కాలం కాస్త ముందుగానే ప్రారంభమైంది. గత నెల చివరి వారం నుంచే ప్రతాపం చూపుతున్న భానుడు.. ఈ నెలలో ఉగ్ర రూపం చూపిస్తున్నాడు. ఉదయం 9 గంటలకే ఎండలు మండిపోతుండటంతో.. ఇళ్ల నుంచి బయటికి రావాలంటేనే జనం భయంతో జంకుతున్నారు. ఇక ఎమర్జెన్సీ పనులు ఉన్నవారు ఎండలోనే బయటికి వెళ్లి అస్వస్థతకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది.

# సీఎం రేవంత్ రెడ్డికి యాదాద్రి ప్రసాదం అందజేత

**ముద్ర, ప్రతినిధి భువనగిరి:**

హైదరాబాదులోని శాసన సభ ప్రాంగణంలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని, రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి లడ్డు ప్రసాదాన్ని వారికి అందజేశారు. అనంతరం రాజ్యసభ ఎంపీ గా ఏకగ్రీవంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, శివ కుమార్ లు కలిసి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి లడ్డు ప్రసాదాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.





## టీఏఎఫ్ఆర్సీ ఛైర్మన్ పదవీ కాలం పొడిగింపు

- తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఛైర్మన్ గోపాల్‌రెడ్డి కొనసాగింపు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ అడ్మిషన్స్, ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) ఛైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఏ.గోపాల్‌రెడ్డి పదవీ కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆయన ఈ పదవిలో కొనసాగేలా నిబంధనలకు సడలింపు ఇస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ గోపాల్‌రెడ్డి నేతృత్వంలో టీఏఎఫ్ఆర్సీ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం 2023 ఫిబ్రవరిలో ప్రకటించింది. రాష్ట్రంలోని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కోర్సులకు సంబంధించిన ఫీజుల నిర్మాణాన్ని ప్రభుత్వం ఇటీవలే అధికారికంగా ఖరారు చేసింది. 202526 విద్యా సంవత్సరం నుంచి 202728 వరకు వర్తించే ఈ కొత్త ఫీజులపై ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా జీవో నెం.06తో ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా నిర్ణయించిన ఫీజులు 202526 నుంచి 202728 విద్యా సంవత్సరానికి వర్తించనున్నాయి. తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ సమర్పించిన సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ ఫీజులను నిర్ణయించింది. ఖరారు చేసిన ట్యూషన్ ఫీజులో అడ్మిషన్ ఫీజు, ఇతర ప్రత్యేక ఫీజులు కలవని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# చేనేత సమస్యలు పరిష్కరించండి

- మంత్రి తుమ్మలకు తెలంగాణ చేనేత కార్మిక సంఘం ప్రతినిధి బృందం వినతి

**ముద్ర, హైదరాబాద్:**



తెలంగాణ చేనేత కార్మిక సంఘం ప్రతినిధి బృందం హ్యాండ్‌లూమ్ & టెక్స్టైల్ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర్ రావును వారి నివాసంలో కలిసి చేనేత పరిశ్రమకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించింది. రాష్ట్ర గౌరవాధ్యక్షులు మాజీ ఎంఎల్సీ చెరుపల్లి సీతారాములు నాయకత్వంలో రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, కార్యదర్శి ముషం నరహరి, ఉపాధ్యక్షులు వర్కాల చంద్ర శేఖర్‌లతో కూడిన ప్రతినిధి బృందం ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుల రుణ మాఫీకి సంబంధించి రూ.16.27 లక్షలు ప్రభుత్వం నుంచి వచ్చినట్లు మంత్రి తెలిపారు. అయితే కొన్ని ఫైల్లు బ్యాంకుల్లో లేవని అధికారులు చెబుతున్న నేపథ్యంలో, బ్యాంకులు ఇచ్చిన లేఖల ఆధారంగా రుణ మాఫీ అమలు చేయాలని సంఘం నాయకులు కోరారు. త్రిఫ్ట్ పథకంలో చేనేత కార్మికులు తమ వాటాను ప్రతి నెల చెల్లిస్తున్నప్పటికీ, ప్రభుత్వం జమ చేయాల్సిన డిపాజిట్ రెండు నెలలుగా పెండింగ్‌లో ఉందని తెలిపారు. వెంటనే కార్మికుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం వాటాను జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో అమలులో ఉన్న యార్న్ సబ్సిడీ స్థానంలో ప్రకటించిన "నేతన్న భరోసా" పథకం ఇప్పటివరకు అమలు కాలేదని, చేనేత కార్మికునికి రూ.2 వేలు, అనుబంధ కార్మికులకు ఇద్దరికీ రూ.500 చొప్పున జమ చేసే విధంగా వెంటనే అమలు చేయాలని కోరారు. నేతన్న భీమా పథకంలో 59 ఏళ్ల లోపు వారికి ఇన్సూరెన్స్ కంపెనీలు సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ, 59 ఏళ్లు పైబడిన కార్మికులకు టెస్కో వద్ద నిధుల లేమి కారణంగా రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఏడాదిన్నరగా అందడం లేదని తెలిపారు. కేంద్రం రద్దు చేసిన ఐసీఐసీఐ హెల్త్ ఇన్సూరెన్స్ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఆరోగ్య బీమా పథకం అమలు చేయాలని కోరారు. గురుకులాలకు టెస్కో ద్వారా చేనేత వస్త్రాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇక చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాల మాఫీ, సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించడం, చేనేత కార్మికులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద హౌస్ కమ్ వర్క్ షెడ్లు మంజూరు చేయడం, ప్రతి కార్మికుడికి వడ్డీ లేని రూ.5 లక్షల పెట్టుబడి రుణం ఇవ్వడం వంటి డిమాండ్లను కూడా వినతి పత్రంలో పేర్కొన్నారు. చేనేతకు రిజర్వ్ చేసిన 11 రకాల వస్త్రాలపై చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. గద్వాల జిల్లా రాజోలి, నల్లగొండ జిల్లా చండూర్, నకిరేకల్ ప్రాంతాల్లో వర్షాకాలంలో మగ్గం గుంటల్లోకి నీరు చేరే సమస్య ఉన్న చేనేత కార్మికులకు స్టాండ్ మగ్గాలు ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ పథకం కింద హౌస్ కమ్ వర్క్ షెడ్లు మంజూరు చేయాలని కూడా కోరారు. ఈ అంశాలపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు.

మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..


మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com


# మూత్ర పిండ సమస్యకు కారణాలు అనేకం !



*** (12 మార్చి "ప్రపంచ మూత్ర పిండాల దినోత్సవం" సందర్భంగా)**

ప్రతి ఏటా మార్చి 2వ గురువారం ప్రపంచ వ్యాప్తంగా "ప్రపంచ మూత్ర పిండాల దినోత్సవం (వరల్డ్ కిడ్నీ డే)" జరుపుకుంటూ కిడ్నీల ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన పెంచుకోవడం, ప్రచారం నిర్వహించడం నిరంతరం జరగాలి. ప్రపంచవ్యాప్తంగా 10 శాతం వరకు పెద్దలు ఏదో ఒక రకమైన మూత్రపిండాల సమస్యలతో బాధ పడుతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మూత్రపిండ సమస్యలు ముదిరితే లక్షలాది రోగులు అకాలమరణం బారిన పడుతున్నారు. మూత్ర పిండాల సమస్యలను నిరోధించడానికి ముందస్తుగా పరీక్షలు చేయించుకొని తగు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రాణాలు దక్కుతాయని గమనించాలి. మూత్ర పిండ సమస్యలు నిశ్శబ్దంగా తీవ్రరూపం దాల్చుతుంటాయి. ముత్ర పిండాలు రక్తం నుండి వ్యర్థాలను, అదనపు ద్రవాలను ఫిల్టర్ చేస్తూ బిపీ, ఎలక్ట్రొలైట్ సమతుల్యత కల్పిస్తూ, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి కూడా సహాయ పడతాయి.





**ప్రపంచ మూత్ర పిండాల దినోత్సవం - 2026 ఇతివృత్తం :**

మూత్ర పిండాల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రచారం చేయడానికి "ఇంటర్నేషనల్ కిడ్నీ ఫౌండేషన్", "ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కిడ్నీ ఫౌండేషన్" సంయుక్తంగా 2006 నుంచి ప్రతి సంవత్సరం మార్చి మాసంలో రెండవ గురువారం, అనగా 12 మార్చి 2026 రోజు "ప్రపంచ మూత్ర పిండాల దినోత్సవం" పాటించడం ఆనవాయితీగా మారింది. మూత్ర పిండాల ఆరోగ్య సంరక్షణకు చేపట్టవలసిన జీవనశైలి మార్పులు, తరుచుగా పరీక్షలు, సాధారణ మెలకువలు లాంటి అంశాలను విస్తృతంగా అవగాహన కల్పించడం జరుగుతోంది. ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం 2026 ఇతివృత్తంగా "అందరికీ మూత్ర పిండాల ఆరోగ్యం : ప్రజల సంరక్షణ, భూగోళ రక్షణ" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

**మూత్ర పిండాల ఆరోగ్య పరిరక్షణ చర్యలు:**

మూత్ర పిండాల ఆరోగ్య సంరక్షణకు నిత్యం తగినంత నీటిని త్రాగడం, సమతుల ఆహారం తీసుకోవడం, రక్తపోటు నియంత్రణ, మధుమేహ అదుపు, క్రమం తప్పకుండా వ్యాయామం, ధూమపానానికి దూరంగా ఉండడం, అతిగా మద్యం సేవించకుండా ఉండడం, మితిమీరిన ఇతర నొప్పి నివారణ మందులు వాడకాన్ని తగ్గించడం, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం, మూత్ర పిండాల పట్ల అవగాహన కలిగి ఉండడం, ఆరోగ్యకరమైన జీవనశైలినా పాటించడం, దురలవాట్లకు దూరంగా ఉండడం లాంటివి పాటించాలి. మూత్ర పిండ సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు అలసట, పాదాల వాపు, చీలమండల వాపు, మూత్ర విసర్జనలో మార్పులు, బలహీనత, ఆకలి మందగించడం, నురగ లేదా రక్తంతో కూడిన మూత్ర విసర్జన, కళ్ళ చుట్టు వాపు, వికారం వంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి. మూత్ర పిండాల సమస్య తీవ్రత పెరిగి వైఫల్యానికి లోనయితే డయాలిసిస్, మూత్ర పిండ మార్పిడి కూడా అవసరం అవుతాయి.

**మూత్ర పిండ సమస్యలకు కారణాలు - రోగ లక్షణాలు :**

మధుమేహం, అధిక బిపీ ఉన్న వారు క్రమం తప్పకుండా కిడ్నీల పని తీరు పరీక్షలు చేయించుకోవాలి. జన్యుపరమైన కారణాలు కూడా కిడ్నీ సమస్యలకు రాకుండా కావచ్చని గమనించాలి. గుండె జబ్బులు, స్ట్రోక్ చరిత్ర ఉన్న వ్యక్తులకు మూత్ర పిండ సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువ. 60 ఏండ్లు పైబడిన వృద్ధులు, అధిక బరువు, పునరావృత ఇన్ఫెక్షన్లు, మూత్ర పిండాల్లో రాళ్లు ఉన్న వ్యక్తులు, మూత్ర పిండాల ప్రభావంతో దీర్ఘకాలిక మందులు వాడే వ్యక్తులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. మూత్ర పిండాల ఆరోగ్య పరీక్షలకు రక్తం, మూత్రం, ఇమేజింగ్, కిడ్నీ బయాప్సీ, అదనపు పరీక్షలు లాంటివి డాక్టర్లు పర్యవేక్షణలో చేయించుకోవాలి.


అన్ని రకాల మూత్ర పిండ సమస్యలను నివారించకపోవచ్చు. కాని బిపీ, షుగర్, బరువు నియంత్రణ, దురలవాట్లకు దూరంగా ఉండడం, నొప్పి నివారణ మందులను తగ్గించడం, క్రమం తప్పకుండా సాధారణ వైద్య పరీక్షలు చేయించుకోవడం, వ్యాయామం చేయడం లాంటి జీవనశైలిని పాటించాలి. ప్రారంభ దశలో నిశ్శబ్దంగా వచ్చే మూత్ర పిండ సమస్యలకు సకాలంలో స్క్రీనింగ్ చేయించుకోవడం ముఖ్యమని తెలుసుకోవాలి. వృద్ధులు, అధిక బిపీ, అధిక షుగర్, తెలివిగా తినడం, గుండె జబ్బులు, జన్యుపరమైన చరిత్ర కలిగిన వ్యక్తులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ మూత్ర పిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. నేటి ఒక చిన్న ప్రయత్నం రేపటి పెద్ద సమస్యను నివారిస్తుందని మరిచిపోరాదు.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037





చెట్టే కదా
నేను నీళ్ళు పోస్తేనే
బతుకుతున్నదన్న ఉదాసీనత
నేను ఎరువేస్తెనే
ఎదుగుతున్న దన్న పెడ్డితనం
నేను లేనిదే దానికి బతుకే లేదన్న
దర్పం.
కానీ నేడా చెట్టు లేదు
ఈదురు గాలులు విసిరి కొడుతున్నె
వడ గాలులు దడ లేపుతున్నె
పగటెండ కు పెయ్యి
పగిలి సెగలెక్కు తున్నది.
నిలువ నీడ లేదు
వడగాలి నాపే దడి లేదు
వీచే చల్లని గాలే లేదు
ఊపిర దీసు కునుడు కే
పాణం ఉక్కిరి బిక్కిరి అయితున్నది
నీవున్నప్పుడు తెలువలే
ఎన్ని చెంప దెబ్బలనూ
ఎదిరించి నన్ను రక్షించినవో
నీ తనువంతా ఒడ్డి
నా తండ్లాటను తప్పించినవో
ఇప్పడే ఎరుకైతాంది
నీ ఉనికి లేని నా
బతుకు
ఇరుకిరుకేనని.



- పెంటయ్య
వీరగోనీ

# నిజాం వ్యతిరేక పోరాట యోధుడు మందుముల

*** మార్చి 12...మందుముల నరసింగరావు వర్ధంతి**

మందుముల నరసింగరావు (మార్చి 17, 1896 మార్చి 12, 1976) నిజాం విమోచన పోరాట యోధుడు, రాజకీయ నాయకుడు, పత్రికా రచయిత, న్యాయవాది, ఆంధ్ర జనసంఘ స్థాపకులు, సంఘ సంస్కర్త, పాలమూరు జిల్లాకు చెందిన సమరయోధుడు మందుముల నరసింగరావు మార్చి 17, 1896 న ప్రస్తుత రంగారెడ్డి జిల్లా చేవెళ్ళలో జన్మించారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన నరసింగరావు న్యాయ శాస్త్రంలో పట్టభద్రులు అయినారు. పర్షియన్ భాషలో కూడా అయన గొప్ప పండితులు, పత్రికా రచయితగా పేరు పొందారు. 1921లో ఆంధ్ర జనసంఘాన్ని స్థాపించిన వారిలో ఒకడు. 1927లో న్యాయవాద వృత్తికి స్వస్తి చెప్పి పత్రికారచన, రాజకియాలు చేపట్టారు. 1927లో రయ్యత్ అనే ఉర్దూ వార్తా పత్రిక స్థాపించి సంపాదక బాధ్యతలు చేపట్టారు. మందుముల, సమర రంగంలో కూడా కీలకపాత్ర వహించి 1937లో ఇందూరు (నిజామాబాదు) లో జరిగిన 6వ ఆంధ్ర మహాసభకు అధ్యక్షత వహించారు. 193842 కాలంలో నిజాం లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారు. 1947లో జాయిన్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టు అయ్యారు. బాల్య వివాహాల రద్దుకు, వితంతు వివాహాలకు బాగా కృషి చేశారు. 1952లో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున హైదరాబాదు శాసనసభకు ఎన్నికయ్యారు. 195762 కాలంలో రాష్ట్ర మంత్రివర్గంలో పని చేశారు. నిజాం కాలంలోని దుష్పరిపాలనను వర్ణిస్తూ "50 సంవత్సరాల హైదరాబాదు" గ్రంథాన్ని స్వీయజీవిత చరిత్రగా రచించారు.

**మందుముల నరసింగరావు...**


టేకుమాల రంగారావు, మాడపాటి హనుమంత రావు, మిట్ట లక్ష్మీనరసయ్య, ఆదిరాజు వీరభద్రరావు, నడింపల్లి జానకి రామయ్య, బూర్గుల రామకృష్ణారావు, బోయినపల్లి వెంకట రామారావు, కొమ్మవరపు సుబ్బారావు బూర్గుల నరసింహా రావు, డాక్టర్ పందింటి రామస్వామి నాయుడు తదితరులతో కలిసి 'ఆంధ్ర జనసంఘం'ను స్థాపించారు.

హైదరాబాద్ సంస్థాన ఆధునిక చరిత్రలో రావి నారాయణరెడ్డి, ముఖ్దూం మొహియుద్దీన్ వంటివారు అతివాద వర్గం ప్రతినిధులు కాగా, బూర్గుల రామ కృష్ణారావు, మందుముల నరసింగ రావు, మాడపాటి హనుమంత రావు, మాదిరాజు రామ కోటీశ్వర రావుతదితరులు మితవాదులు.

భువనగిరిలో జరిగిన ఆంధ్రమహా సభలకు వివిధ గ్రామాల నుండి ఎడ్ల బండ్లపై వచ్చిన వారు...రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి, మందుముల నరసింగరావు, బూర్గుల రామకృష్ణరావు లాంటి ప్రముఖులను ఎడ్ల బండ్ల మీద ఊరేగించారు. ఆయన బాల్య వివాహాల రద్దుకు, వితంతు వివాహాలకు బాగా కృషిచేశారు. 1952లో కల్వకుర్తి నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున హైదరాబాదు శాసనసభకు ఎన్నికయ్యాడు. 195762 కాలంలో రాష్ట్ర మంత్రివర్గంలో పనిచేశాడు. నిజాం కాలంలోని దుష్పరిపాలనను వర్ణిస్తూ "50 సంవత్సరాల హైదరాబాదు" గ్రంథాన్ని స్వీయజీవిత చరిత్రగా రచించాడు. యాభై ఏళ్ల హైదరాబాదు నగర సమగ్రచరిత్ర ఈ గ్రంథం. హైదరాబాదు రాజకీయ సామాజిక జీవనంలో ప్రధానపాత్ర పోషించి, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ప్రజాస్వామ్య ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన మందుముల నరసింగరావు కలం నుండి వెలువడిన రచన. ప్రత్యక్ష సాక్షిగా ఆయన కథనం.

మందుముల నరసింగరావు కూతురు అనంతలక్ష్మిని బూర్గుల రామకృష్ణారావు రెండో వివాహం చేసుకున్నారు. సమర యోధుడిగా పేరుపొందిన మందుముల రామచంద్రారావు ఆయన సోదరుడు. మార్చి 12, 1976 న మందుముల మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494



## యుద్ధం



యుద్ధం అవనికి రాచపుండు
యుద్ధం ఆగినా పుండు మానది త్వరగా
విధ్వంసం నుంచి వికాసం వైపు పయనించాలంటే
దశాబ్దాలు ధ్వంసమైపోవచ్చు
పచ్చని మొక్కలు తిరిగి మొలవడానికి తరాలు మారొచ్చు

గెట్టు పంచాయతీ లేదు, పాలిపగలు లేవు
వేలు పెట్టి చూపించి ఎక్కిరించింది లేదు
దొర ముందు చెప్పలిడువక తలెత్తుకొని నడిస్తే
శాస్తి చేసేవారు పెత్తందారుల కాలంలో
అగ్రరాజ్యం దొర దాడులు అంతే
ఒకచోట రాజ్యాధినేత కిడ్నాప్
మరోచోట కనిపెట్టి దొంగ దెబ్బ బాంబుల దాడి
మరో దేశాధినేత హతం



ఇప్పుడు యుద్ధమంటే
తలెత్తుకొని తిరిగే వాడి తల ఆనమాలు లేకుండా చేయడం
కనిపెట్టి కబర్ లేకుండా బాంబులు వేయడం
తలపొగరు దొర తప్పంతా ఇతరులదేనంటారు
అగ్నికి ఆజ్యం పోస్తున్న పొరుగు దేశాలు
తప్పును తప్పని నిలదీయరెవరు

ఇప్పుడు యుద్ధమంటే సరిహద్దులో పోరాటం
కాదు
ఉన్న చోటి నుంచే ఉప్పందిన ప్రాంతంపై బాంబుల
దాడియుద్ధం రెండు దేశాల మధ్య కాదు
శత్రువుతో పాటు సహాయపడ్డ వారిపై దాడి
డ్రోన్లు, బాంబులు పేలుతున్నాయి గాలిలో, భూమిపై
ఆనవాళ్ళన్నింటిని బూడిద చేస్తున్న పోరాటాలు
రక్తపుటేరుల ప్రాణాలపై సంతాపాలుండవు
పసి పిల్లలు, సామాన్యుల ప్రాణాలు గాల్లో ఖతం
ప్రపంచ చరిత్రలో చెరిగిపోని మచ్చ

యుద్ధ ప్రభావంతో అన్ని దేశాల ఆర్థిక మూలాలకు ముప్పు
అగ్ర రాజ్యాల ఆయుధ,ఆయిల్ అంగళ్లకు భలే గిరాకీ
విధ్వంసాన్ని ఖండించలేని రాజ్యాల నీతి వాక్యాలు
చర్చలతో పరిష్కారం అవుతాయంటారు అన్నీ
యుద్ధాన్ని ఆపలేరెవరు మధ్యవర్తులు
విధ్వంస వినాశనం అవని ఆరోగ్యానికి కష్టకాలం
యుద్ధమంటే లోక భవిష్యత్తును నాశనం చేసే
మతులు పోగొట్టే విధ్వంసకర మారణాయుధం



కొమురవెల్లి అంజయ్య
సిద్దిపేట, సెల్ 9848005676

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 12.03.2026
www.mudranews.in | @mudranews



### పిల్లల్లో వెంట్రుకలు తెల్లబడకుండా చిట్కాలు

విటమిన్-B12 లోపం నివారించాలి. చిన్న వయసులో జుట్టు తెల్లబడటానికి ప్రధాన కారణాల్లో ఇది ఒకటి. పాలు, పెరుగు, గుడ్లు, చేపలు వంటి ఆహారాలు ఇవ్వడం మంచిది.

# పాలమూరు విద్యార్థులు.. కోహినూర్ వజ్రాలు

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:** పాలమూరు విద్యార్థులు కోహినూర్ వజ్రాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కొనియాడారు. మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని వైటిసి భవనంలో 45 రోజుల పాటు ఐఐటీ లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న 150 మంది విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాలమూరు అంటే కేవలం శ్రామిక జిల్లా కాదని, ఎన్నో అన్యాయాలు, దగా, మోసాలకు గురైన జిల్లా అని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి పాలమూరు చరిత్ర ప్రధాన ఆధారమని, తెలంగాణ ఉద్యమంలో పాలమూరుకు జరిగిన అన్యాయం గురించి చెప్పి రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాలమూరు జిల్లాకు పూర్తి న్యాయం జరగలేదన్నారు. అందుకే యువత తెలంగాణ చరిత్రను కొత్తగా రాసి , భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును నిర్ధారించే శక్తి యువతలోనే ఉందన్నారు. అందుకే విద్యార్థులు తమ లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. ఎంత ఎత్తుకు ఎదగాలనుకుంటే అంత ఎత్తుకు ఎదగడానికి తెలంగాణ రాష్ట్రంలో అవకాశాలు చాలా ఉన్నాయని, అందుకు అవసరమైన సహాయ సహకారాలు ఎల్లవేళలా అందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఎన్నో దశాబ్దాలుగా ఈ ప్రాంతం ఎన్నో కష్టాలు, కరువు కాటకాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

ఎదుర్కొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మనకు వనరులు లేవని కేవలం మన పూర్వీకులు ఇచ్చిన జ్ఞానమే మనకు ఉన్న ఏకైక ఆస్తి అని ఆయన అన్నారు. మన డీఎన్ఏలో ఉన్న మేధస్సు, తెలివి, కష్టపడే మనస్తత్వం, ప్రేమతో పలకరించే గుణాన్ని మనం ఆయుధాలుగా చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ శిబిరంలో పాల్గొన్న 150 మంది విద్యార్థులు తమ విజయాలతో తల్లిదండ్రులకు పేరుప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. బాగా కష్టపడి చదవాలని, అది తమ కోసం మాత్రమే కాకుండా కుటుంబ భవిష్యత్తు కోసం అవసరమన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి విద్య, సాగునీటి రంగాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. గత రెండేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం జరిగిందని, ఇంకా చేయాల్సింది చాలా ఉందన్నారు. ఈ విద్యా యజ్ఞంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు వచ్చే పదేళ్లు కష్టపడాలని పిలుపునిచ్చారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధన కోసం కష్టపడాలని విద్యార్థులకు సూచించారు. మహబూబ్‌నగర్ అభివృద్ధికి అవసరమైనన్ని నిధులు ఇవ్వడానికి ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని, ఇది జిల్లాకు లభించిన గొప్ప అవకాశమని, ఇదే మన పాలమూరుకు లభించిన స్వర్ణయుగమని ఆయన అన్నారు. పాలమూరు లేబర్ జిల్లా కాదని, సరస్వతి పుత్రుల అడ్డాగా నిలిపే బాధ్యత మనందరిదని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ జానకి మాట్లాడుతూ వ్యక్తి జీవితంలో విద్య వైద్యం రెండూ లభిస్తే జీవితం సాఫీగా ముందుకు సాగుతుందన్నారు. తల్లిదండ్రులు మీ పైన పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, అందుకే కసిగా చదువుకోవాలని, లక్ష్యం సాధించడంలో ఆడ, మగ అనే తేడా ఉండదని చెప్పారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివినప్పుడు అప్పట్లో ఇలాంటి ఎమ్మెల్యే లేరని, అయినా కాన్ఫిడెన్స్ తో చదివి, ఎస్పీగా ఎంపికైనట్లు ఆమె పేర్కొన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి, ఐఐటీలో సీటు సాధించి, ఎమ్మెల్యేకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని ఆమె ఆకాంక్షించారు. మేయర్ గుమ్మాల మమత మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ను ఎడ్యుకేషనల్ హబ్ గా అభివృద్ధి చేయడంలో సఫలీకృతం అయిన ఎమ్మెల్యే పేదింటి బిడ్డల కలలను సాకారం చేయడానికి కృషి చేస్తున్నారని చెప్పారు. డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ ఫౌండర్ రవీందర్ మాట్లాడారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్ గుముడాల రాధ, డీఈవో ప్రవీణ్ కుమార్, ఐఐఐటీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రావణ్ కుమార్, ఏఎంవో శ్రీనివాస్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోండి

● ఎమ్మెల్యే నవీన్ యాదవ్



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బురదజల్లే ప్రయత్నాలను చేయడం సరికాదని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అన్నారు. కోకాపేట్ నియో పోలీస్ ప్రాంతంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కొకాపేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నియో పోలీస్ ప్రాంతంలో అక్రమంగా కంకర క్రషర్లు నడుపుతున్నారంటూ ముఖ్యమంత్రి మేనల్లుడిపై బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. తమ సంస్థ అన్ని ప్రభుత్వ అనుమతులతోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నదని స్పష్టం చేశారు. ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నంలో భాగంగానే బీఆర్ఎస్ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తమపై చేసిన ఆరోపణలను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ నాయకులను డిమాండ్ చేశారు.

## రోడ్డు పనులు ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే



**ముద్ర, కాప్రా:** కాప్రా డివిజన్ పరిధిలోని గోపాల్ రెడ్డి నగర్‌లో రూ.28 లక్షల నిధులతో చేపట్టనున్న రోడ్డు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాంత ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీ వంటి అభివృద్ధి పనులను దశల వారీగా పూర్తిచేస్తామన్నారు. ప్రాంత ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్, స్థానిక నాయకులు, ప్రజలు పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా పుల్లారు ఆరాధనోత్సవం

**ముద్ర, కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి బాలాజీ నగర్ డివిజన్ పరిధిలోని ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి దేవస్థాన వ్యవస్థాపకులు, ప్రముఖ అన్నదాత పుల్లారు నారాయణదాసు 26వ ఆరాధన మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై నారాయణదాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం దేవాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రావు మాట్లాడుతూ నిగర్విగా, నిరతాన్నదాతగా పేరుగాంచిన పుల్లారు నారాయణదాసు సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో పాటు ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడమే పరమావధిగా జీవించిన ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

### భీమునికుంట చెరువు అలుగు పరిశీలన

**ముద్ర, శేరిలింగంపల్లి:** హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని భీముని కుంట చెరువు అలుగును పీయేసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, జీహెచ్ఎమ్సీ, జలమండలి, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు భీముని కుంట చెరువు ను పరిశీలించడం జరిగిందని, చెరువును త్వరలోనే సుందర శోభితంగా తీర్చిదిద్దుతామన్నారు. భీముని కుంట చెరువు ఇన్ లెట్, ఔట్ లెట్ స్థితిగతులను పరిశీలించారు. అలుగు వద్ద చెత్త, చెదారం పెరుకుపోవడం వలన నీటి ప్రవాహం సాఫీగా సాగక మురుగు నీటి వ్యవస్థ తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలుగు వద్ద పేరుకుపోయిన చెత్త చెదారం వెంటనే జేసీబీతో తొలగిస్తామన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులకు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

# అవకాశాలు కల్పిస్తే ఆణిముత్యాలు

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి





**ముద్ర, మల్కాజిగిరి:** మహిళలకు అవకాశాలు కల్పిస్తే సమాజంలో ఆణిముత్యాల్లా వెలుగొందుతారని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. నేరెడ్‌మెట్ డివిజన్ జె.జె నగర్ మహాబోధి ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ నాయకులు జే.కే. సాయి కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, ఆయన సతీమణి మమతా రాజశేఖర్ రెడ్డి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల గొప్పతనాన్ని కొనియాడుతూ "కార్యేషు దాసి, కరుణేషు మంత్రి, భోజేషు మాత" అనే మాటలను ఉదహరించారు. కుటుంబం నుంచి సమాజం వరకు ప్రతి రంగంలో మహిళల పాత్ర అమూల్యమన్నారు. అలాగే తన సతీమణి మమతా రెడ్డి రాజకీయంగా, వ్యాపారపరంగా తనకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ ముందుకు నడిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రావుల అంజయ్య, జేఏసీ వెంకన్న, జీ.కే. హనుమంత్ రావు పాల్గొన్నారు.

**ఘనంగా మహిళా దినోత్సవం**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** వికారాబాద్ మున్సిపల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేసి అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు మున్ముందు మరి ఇంకెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి, కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, కౌన్సిలర్లు, మహిళలు పాల్గొన్నారు.

### రుణాల మంజూరు లక్ష్యసాధనకు
# వేగంగా చర్యలు చేపట్టాలి

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్



**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డిజిల్లా ప్రతినిధి:** రుణాల మంజూరు లక్ష్యసాధనకు వేగంగా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి జిల్లా యొక్క సంభావ్య క్రెడిట్ ప్రణాళికను ఆయన ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా బ్యాంకింగ్ కార్యకలాపాల పురోగతి, వివిధ ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలును సమీక్షించేందుకు బుధవారం జిల్లా బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ బ్యాంకుల, ఆర్ బీఐ, నాబార్డ్ అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో వివిధ రుణ పథకాల అమలు, లక్ష్యసాధనపై సమీక్ష జరిపారు. ముఖ్యంగా వ్యవసాయ అడ్వాన్సులు, ఎం ఎస్ ఎం ఈ అడ్వాన్సులు, విద్యా రుణాల పంపిణీల కింద పురోగతిపై చర్చించారు. ఎంఎస్ఎంఈ యూనిట్లు, విద్యార్థులకు క్రెడిట్‌ను అందించడంలో ఎదురయ్యే సమస్యలను సమీక్షించారు. రుణ ప్రవాహాన్ని మెరుగుపరిచేందుకు, అర్హత కలిగిన రుణాలు సకాలంలో మంజూరు, పంపిణీని నిర్ధారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లకు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. జిల్లాలో ఆర్థిక చేరికను పెంచేందుకు, ఆర్థిక అభివృద్ధికి మద్దతు ఇవ్వడానికి బ్యాంకులు, ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ ప్రయత్నాలు ఉండాలని నొక్కి చెప్పారు. రుణ ప్రాసెసింగ్‌ను క్రమబద్ధీకరించేందుకు, క్రెడిట్ డెలివరీలో అడ్డంకులను పరిష్కరించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ దీపక్ తివారి

**ముద్ర, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రిని బుధవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో రోగులకు అందించే వైద్య సేవలు, వైద్య సిబ్బంది హాజరును పరిశీలించారు. జిల్లా ఆసుపత్రి ఇన్చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్ వైద్య సిబ్బందిని వేధింపులకు గురిచేసిన విషయమై కోఆర్డినేటర్ ఆనంద్ ను అడిగితెలుసుకున్నారు. వైద్యులు క్రమశిక్షణతో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని, వైద్యులు, సిబ్బంది అందరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న డ్రెయినేజీ, మౌలిక వసతులు, సమస్యలను సంబంధిత అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా కలెక్టర్ స్పందిస్తూ వారంలోగా ఆసుపత్రిలో ఉన్న సమస్యలపై నివేదికలు తెప్పించుకొని, ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయిస్తానని, పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో అందరూ భాగస్వాములు కావాలి**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో అందరూ భాగస్వాములు కావాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. తాండూర్ మండలం గౌతాపూర్ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి అంటే కేవలం ప్రభుత్వం చేస్తేనే అభివృద్ధి కాదని ప్రజాప్రతినిధులు, ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు అయినప్పుడు మాత్రమే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

## మున్సిపల్ చైర్ పర్సన్ సుడిగాలి పర్యటన



**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** వికారాబాద్ పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. బిజెర్ చౌరస్తా నుండి రామయ్యగూడ వరకు ఇటీవల శుభ్రం చేసిన ఓపెన్ డ్రైన్ ను పరిశీలించి, 23 వార్డు లోని ఆలంపల్లి ఈద్గా వద్ద రంజాన్ పండుగ రోజు జరిగే ప్రత్యేక ప్రార్థనల కోసం చేసే ఏర్పాట్లను పరిశీలించారు. ప్రార్థనల సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆలంపల్లి బోనమ్మగుంత దేవాలయ పరిసరాలను పరిశీలించి, ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని సూచించారు. తదుపరి రామ్ మందిర్ ఎదురుగా, అనంతగిరి రోడ్డు లోని లైబ్రరీ పక్కన ఉన్న పబ్లిక్ టాయిలెట్స్ ను పరిశీలించి, శుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం 29వ వార్డులోని మిషన్ కాంపౌండ్ లో ఉన్న ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ లో ఉన్న కిచెన్, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థినులతో పాటుగా భోజనం చేసి, మెను ఫాలో కావాలని, బాలికలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తగా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రంసింహా రెడ్డి, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బయూజీసీ నెట్ జాబితాలో 'మెకానికల్ ఇంజనీరింగ్'ను చేర్చాలి

**ముద్ర, కూకట్‌పల్లి :** యూజీసీ నిర్వహించే నెట్ పరీక్షా సబ్జెక్టుల జాబితాలో 'మెకానికల్ ఇంజనీరింగ్'ను చేర్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు బుధవారం జేఎన్టీయూ రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరిశోధక విద్యార్థి, విద్యార్థి నాయకుడు జవ్వాజి దిలీప్ మాట్లాడుతూ పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థులు ఫెలోషిప్ పొందాలంటే యూజీసీ నెట్ లేదా సీఎస్ఐఆర్ నెట్ అర్హత తప్పనిసరి అని, అయితే ఈ జాబితాలో మెకానికల్ ఇంజనీరింగ్ సబ్జెక్టు లేకపోవడం వల్ల వేలాది మంది పరిశోధక విద్యార్థులు ఫెలోషిప్ దరఖాస్తు చేసుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ఇంజనీరింగ్ విభాగాలకు ఏదో ఒక సంబంధిత సబ్జెక్టులో పరీక్ష రాసే వెసులుబాటు ఉందని, కానీ మెకానికల్ విద్యార్థులకు ఆ అవకాశం లేక ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పరిశోధకులు ఆర్థిక భారంతో ఇబ్బంది పడుతున్నారన్నారు.



తమ అభ్యర్థనపై స్పందించిన రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, జేఎన్టీయూ తరపున యూజీసీకి అధికారికంగా లేఖ రాస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సుజయ్, దుర్గాప్రసాద్, ఆర్కే శ్రీనివాస్, సాగర్ నాయక్, జయరామ్, గగన్ కౌశిక్, తనూజ్, భాస్కర్, ధనుంజయ్, ఆనంద్, హరికృష్ణ, ప్రణయ్ చక్రవర్తి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**పిల్లల్లో వెంట్రుకలు తెల్లబడకుండా చిట్కాలు**

ఒత్తిడి తగ్గించాలి
పిల్లల్లో చదువు ఒత్తిడి, గాడ్జెట్ వినియోగం ఎక్కు వైతే హార్మోన్లపై ప్రభావం పడుతుంది. ఆటలు, వ్యాయామం ద్వారా ఒత్తిడిని తగ్గించాలి.

# ముఖ్యమంత్రి ఆదేశాలు అమలు చేయాలి

**- సాగు నీటి సమస్య పరిష్కరిస్తా**
**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, జగిత్యాల:**
ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఆదేశాలను తూచా తప్ప కుండా అమలు చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సుమంగళి గార్డెన్ లో బుధవారం జిల్లాలోని మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్ లకు ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం తీసుకున్న 99 రోజుల ప్రణాళికలోని పది అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యంగా పెండింగ్ ఫైళ్ళ క్లియరెన్స్ పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ విషయంలో కలెక్టర్ ప్రతిరోజు సమీక్ష నిర్వహించాలని సూచించారు. స్థానిక సంస్థలకు కొత్తగా ప్రతినిధులు ప్రజల అవసరాలను గుర్తించాలని కోరారు. ఇందుకు అవసరమైన నిధులు తీసుకురావడానికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. జిల్లా లోని సాగునీటి సమస్యల పరిష్కా రానికి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ప్రత్యేక సమావేశం నిర్వ హిస్తామని తెలిపారు. గిరిజన సంక్షేమ మం త్రిగా తాను జిల్లాలోని అన్ని గిరిజన గ్రామాలు, తండాలకు రవాణా సౌకర్యం కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తానని చెప్పారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజ య్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజ య్ మాట్లాడారు. జగిత్యాల, ధర్మపురి, మెట్ పల్లి, కోరుట్ల మున్సిపల్ చైర్మన్ లు సమిండ్ల వాణి, వేముల నాగలక్ష్మి, లింబాద్రి, వసంత, కలెక్టర్ సత్య ప్రసాద్ పాల్గొన్నారు.

**చదువును మించిన ఆస్తి లేదు..**

**ముద్ర, ఎండపల్లి:**
చదువును మించిన ఆస్తి లేదని మంత్రి లక్ష్మణ్ కుమార్ సూచించారు. ఎండపల్లి మండలం గుల్ల కోట మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో రూ. 10 లక్షలతో నిర్మించిన కిచెన్ షెడ్స్ ను బుధవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న అనేక మంది గొప్పవారయ్యారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం విద్యకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంద ని ఆయన పేర్కొన్నారు.

## ఇంచార్జి హెచ్ఎం సస్పెన్షన్

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
నిర్మల్ రూరల్ మండలంలోని కొండాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు జి. విజయ భాస్కర్ ను సస్పెండ్ చేస్తూ డీఈవో భోజన్న ఉత్తర్వులు జారీ చేశారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వహించడంతో పాటు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డట్లు గ్రామస్థులు ఫిర్యాదు చేయటంతో విచారణ చేపట్టారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలడంతో వేటు వేసినట్లు డీఈవో పేర్కొన్నారు.

## పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**మహాదేవపూర్, ముద్ర:**
పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. బుధవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులకు పరీక్షలు అంటే భయం లేకుండా అవగాహన కల్పించాలని సూచించారు.

## జన గణనను పకడ్బందీగా నిర్వహించాలి



**మహాదేవపూర్, ముద్ర:**
జనగణనను పకడ్బందీగా నిర్వహిం చాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, విద్యాశాఖల అధికారులతో గణన ప్రక్రియపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ 2027లో జనగణన రెండు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి దశలో హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ ఉంటుందని చెప్పారు. ఈ దశలో సర్వే ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి గృహాల వివరాలు సేకరిస్తారని స్పష్టం చేశారు. వాటిలో గృహ పరిస్థితులు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, కుటుంబాల ఆస్తుల సమాచారం నమోదు చేస్తారని పేర్కొన్నారు. ఈ వివరాలు రెండో దశ జనగణనకు ప్రామాణిక ఆధారంగా ఉప యోగపడతాయన్నారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సీపీఓ జవహర్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మాస్టర్ ట్రైనర్లు హోబాలాల్, సరళ తదితరులు పాల్గొన్నారు.

# ‘అంజన్న’ యాత్రను విజయవంతం చేయాలి

**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి**



**ముద్ర, కరీంనగర్:**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అంజన్న ఆశీర్వాద యాత్ర పేరిట ఈ నెల 14న తలపెట్టిన మహా పాదయాత్రను బీజేపీ శ్రేణులు విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని ఎస్ బీ ఎస్ ఫంక్షన్ హాల్ లో కరీంనగర్ అసెంబ్లీ ముఖ్య నేతలు, కార్పొరే టర్ లతో అంజన్న ఆశీర్వాద యాత్ర సన్నాహాక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కరీంనగర్ మేయర్ పదవిని బీజేపీకి అప్పగిస్తే తన పార్లమెంటు పరిధిలో నూతనంగా ఎన్నికైన పార్టీ ప్రజాప్రతినిధులతో కలిసి కొండగట్టు అంజన్న ఆలయానికి కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకుంటానని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రకటించినట్లు గుర్తు చేశారు. అంజన్న స్వామి ఆశీస్సులతో ప్రజలంతా బీజేపీని ఆశీర్వదించి మేయర్ పీఠాన్ని అప్పగించడంతో కేంద్ర మంత్రి మొక్కు చెల్లించుకోవడానికి సిద్ధమయ్యారని తెలిపారు. ఆ మేరకే ఈ నెల 14న అంజన్న ఆశీర్వాద యాత్ర పేరిట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. పార్ల మెంట్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, ఉపసర్పంచ్ లు, సర్పంచ్ లు, కౌన్సిలర్లు. కార్పొరేటర్లు, మేయర్, డిప్యూటీ మేయర్ తో పాటు దాదాపు పదివేల మంది కార్యకర్తలతో కలిసి పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపు రమేష్, వాసాల రమేష్, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్, ఓదెలు తో పాటు నగరపాలక సంస్థ కార్పొరేటర్లు, కరీంనగర్ జోన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పంట మార్పిడి విధానం అనుసరించాలి



**మహాదేవపూర్, ముద్ర:**
రైతులు పంట మార్పిడి విధానం అనుసరిస్తే అధిక ఆదాయం పొందవచ్చని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి ఏ సునీల్ కుమార్ సూచించారు. టేకుమట్ల మండలంలోని పంగిడిపల్లిలో బుధవారం జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఉద్యాన పంటల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. గ్లోబల్ డ్రిప్ కంపెనీ సహకారంతో రైతులకు డ్రిప్ పరికరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డా. వై. వెంకన్న ఉద్యాన పంటలలో వచ్చే వివిధ చీడపీడల సమస్యలు, వాటి నివారణ చర్యలపై రైతులకు వివరించారు. పండ్ల తోటల పెంపకం, కూరగాయలు, ఆయిల్ పామ్ పంటల సాగుతో మంచి లాభాలు దవచ్చన్నారు. ప్రభుత్వం తరపున ఉద్యాన పంటల ప్రోత్సాహం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు, తోటల స్థాపనకు రాయితీలు, డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్, షేడ్ నెట్ హౌస్‌లు, ఇతర సాంకేతిక సాయం గురించి తెలిపారు. అనంతరం ఉద్యాన మిషన్ పథకం ద్వారా రైతులకు కూరగాయల మినీ కిట్లను పంపిణీ చేశారు. ఎంఈవో కళ్యా ణి, ఏఈఓ రాహుల్, ఉద్యాన విస్తరణ అధికారి రామాచారి, పంగిడిపల్లి, పెద్దపల్లి సర్పంచ్ లు, గ్లోబల్ కంపెనీ ఏరియా మేనేజర్ సుదర్శన్, రా మ్మూర్తి లింగారెడ్డి, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధి రమేష్, రైతులు రాజిరెడ్డి, సత్యం రెడ్డి, మాదాసి మహేందర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ‘ప్రజా పాలన ’లో భాగస్వాములు కావాలి




**ముద్ర, పెద్దపల్లి:**
ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ రాధాకృష్ణ పంక్షన్ హాల్ లో నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చేపట్టారని తెలిపారు. పది శాఖల అధికారులు సమన్వయం చేసుకొని 99 రోజుల్లో ప్రజల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నాలుగు గ్యారంటీలు అమలు చేస్తు న్నామని చెప్పారు. రానున్న రోజుల్లో మరో రెండు హామీలను అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనా ర్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్షతో పాటు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తో పాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపల్ చైర్మన్లు, సర్పంచ్ లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ‘ప్రజా పాలన’ను సామాజిక బాధ్యతగా తీసుకోవాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా కొనసాగించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జిల్లాలోని లక్ష్మణ చాంద మండలం పొట్టపల్లి (కె) లో బుధవారం నిర్వహించిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో ఆమె పాల్గొన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానికులతో కలిసి పరిసరాలు శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు బాధ్యతగా ప్రజలంతా తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో గ్రామస్థు ఈ కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాస్, డీఈఓ భోజన్న, జెడ్పీ సీఈఓ శంకర్, ఆర్ డబ్ల్యు ఎస్ ఈఈ సందీప్, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో రాధా రాథోడ్, సర్పంచ్ ముఖేష్, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, ఇతర అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపు విషయంలో స్పీకర్ నిర్ణయం న్యాయ పీఠం నుంచి అన్యాయం చేసినట్లుందని విమర్శించారు. అన్ని ఆధారాలు ముందే కనిపిస్తున్నా స్పీకర్ కు కనిపించలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ అన్యాయానికి ప్రతినిధిగా మారిందని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్ అరాచకాలను గమనిస్తున్నారని చెప్పారు. తగిన సమయంలో గుణపాఠం చెబుతారన్నారు.

## కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ తరపున గెలుపొందిన కౌన్సిలర్లకు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశం మేరకు మండల, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేయవలసి ఉందన్నారు. పార్టీ కోసం పని చేసే వారికి కమిటీల్లో అవకాశం ఇస్తామని తెలిపారు. పార్టీని బూత్ లెవల్ నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా ఇంచార్జి చంద్రశేఖర్ గౌడ్, నియోజకవర్గ ఇంచార్జి శ్రీహరి రావు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్, అప్పల గణేష్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ, ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, అవేజ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రజాప్రతినిధులకు శిక్షణ

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు గురువారం నుంచి ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అవగాహన కల్పించనున్నారు. పట్టణంలోని తిరుమల గార్డెన్స్ లో సర్పంచ్ లు, మున్సిపల్ కౌన్సిలర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. బుధవారం తిరుమల గార్డెన్స్ ను కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏర్పాట్లను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీల వారీగా కౌన్సిలర్లకు, మండలాల వారీగా సర్పంచ్ లకు సీటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమాన్ని నిర్ణిత సమయానికి ప్రారంభించి సాఫీగా కొనసాగించాలని సూచించారు. సరైన లైటింగ్, సౌండ్ సిస్టం, ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమావేశానికి హాజరైన వారికి ఎప్పటికప్పుడు తాగునీరు అందించాలన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, డీపీఓ శ్రీనివాస్, హార్టికల్చర్ అధికారి రమణ, మున్సిపల్ కమిషనర్ జగ దీశ్వర్ గౌడ్, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

## 28న జాతీయ లోక్ అదాలత్

**మహాదేవపూర్, ముద్ర:** జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అన్ని కోర్టుల ప్రాంగణాల్లో ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఏ. నాగరాజ్ తెలిపారు. బుధవారం నిర్వహంచిన సమావేశంలో మాట్లాడారు. గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. శ్రీనివాస చారి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పుప్పాల శ్రీనివాస్, అదనపు పీపీ ఎండీ రఫీక్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.అక్షయ, న్యాయవాదులు పి. భిక్షపతి, రావుల రమేష్, సుభాష్, ఎల్.విష్ణు, మొయినుద్దీన్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 12-03-2026
www.mudranews.in | @mudranews



పిల్లల్లో వెంట్రుకలు తెల్లబడకుండా చిట్కాలు
సహజ హెయిర్ ఆయిల్ ఉపయోగించాలి
కొబ్బరి నూనె, ఆముదం నూనె లేదా ఆమ్లా ఆయిల్ తో వారానికి 2–3 సార్లు తలకు మసాజ్ చేయడం వల్ల జుట్టు బలంగా ఉంటుంది.




# జీవితం ఒక్కటే.. ఆదర్శవంతంగా జీవించాలి

**- సూర్యాపేట ఎస్పీ కె నరసింహ**
**- నేరాల నివారణపై అవగాహన సదస్సు**




<u>ముద్ర, సూర్యాపేట:</u>

జీవితం ఒక్కటేనని.. అందరూ ఆదర్శవంతంగా జీవించాలని సూర్యాపేట ఎస్పీ కె. నరసింహ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం సూర్యాపేట జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో మునగాల మండల పరిధి ఆకుపాముల గ్రామంలో నేరాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నరసింహ పాల్గొని మాట్లాడారు. బినాన్స్, క్రిప్టో కరెన్సీ లాంటి డిజిటల్ మనీ మార్పిడిలో జాగ్రత్తలు పాటించాలని, అత్యాశకు వెళ్లి సైబర్ మోసగాళ్లకు చిక్కుకొని సైబర్ నేరాల్లో చిక్కుకోవద్దని హెచ్చరించారు. ప్రస్తుత సమాజానికి డ్రగ్స్ అనే చీడపీడ పట్టిందని డ్రగ్స్ నిర్మూలించకపోతే సమాజంలో నేర ప్రవృత్తి పెరుగుతుందని, డ్రగ్స్ ను సమాజం నుండి తొలగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. దీనికోసం పోలీసులతో భాగస్వామ్యమై డ్రగ్స్, గంజాయి కి సంబంధించిన సమాచారం పోలీసులకు ఇవ్వాలని కోరారు. యువత చెడు అలవాట్లకు గురవుతుం దని, పిల్లల నడవడికను తల్లిదండ్రులు గమనించాలని. తప్పుడు మార్గంలో వెళ్లే పిల్లలను తల్లిదండ్రులు మందలించాలని అన్నారు. వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని, తప్పుడు మార్గంలో వాహనాలు నడపవద్దని, రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపవద్దన్నారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలని, కారులో సీట్ బెల్ట్ పెట్టుకోవాలని కోరారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలను నివారించవచ్చునని అన్నారు. రాష్ట్ర పోలీసు ప్రతిష్టాత్మకంగా అరైవ్ అలైవ్ అనే రోడ్డు భద్రత కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం అన్నారు. ఆకుపాముల గ్రామ సమీపంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు.

మహిళలను గౌరవించే, పూజించే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు, మహిళలను గౌరవించాలని కోరారు. మహిళల భద్రతకు పోలీసు శాఖ అధిక ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. షి టీమ్స్, పోలీస్ భరోసా టీం పని చేస్తున్నాయని తెలిపారు. మహిళల, బాలల రక్షణలో చట్టాలు బలోపేతం చేయబడ్డాయని మహిళలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో కోదాడ డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్, సైబర్ సెక్యూరిటీ సెల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, కోదాడ టౌన్ ఇన్స్పెక్టర్ శివ శంకర్, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, మునగాల ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఎస్సైలు రవీందర్, ఏడుకొండలు, కోదాడ ట్రాన్స్పోర్ట్ ఇన్స్పెక్టర్ రామాచారి, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 2027 జనాభా లెక్కలు దేశాభివృద్ధికి కీలకం

**జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి తేజస్ నంద్ లాల్ పవార్**

<u>ముద్ర, సూర్యాపేట:</u>

2027 జనాభా లెక్కలు ప్రభుత్వ పథకాల అమలుకు కీలకమని, అధికారులు పూర్తి అవగాహనతో, క్షేత్రస్థాయిలో బాధ్యతగా పని చేసి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. జిల్లాలో జనాభా గణన–2027 సమర్థంగా నిర్వహించేందుకు జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జనాభా గణనను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన విధానాలు, మార్గదర్శకాలను తప్పని సరిగా పాటించాలన్నారు.

ఈ జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశలో గృహాల గణన మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు, రెండో దశలో జనాభా గణన 2027 ఫిబ్రవరిలో జరుగుతుందని వివరించారు. మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారన్నారు. ఈసారి జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారని, మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌లను ఉపయోగించి గణన ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక పోర్టల్ ను గణన ప్రారంభానికి సుమారు 15 రోజుల ముందు అందుబాటులో ఉంచనున్నట్లు స్పష్టం చేశారు.

అనంతరం శిక్షణ నిర్వాహకులు, సీపీఓ కిషన్ నాయక్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని తెలిపారు. అనంతరం జనాభా గణాంక అధికారులు యువేందర్ బాబు, రవీంద్ర నాయక్ ప్రతి మండలంలోని రెవెన్యూ గ్రామాలను, పట్టణాల వార్డులను గణన బ్లాకులుగా ఎలా విభజించాలి, గణన ప్రక్రియను ఎలా నిర్వహించాలి అనే అంశాలపై అధికారులకు శిక్షణ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్ ఆర్డీవోలు వేణు మాధవ రావు, సూర్యనారాయణ, శ్రీని వాసు, మాస్టర్ ట్రైనర్ రమేష్, ఎంపిడిఓలు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాల స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్





<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి:</u>

యాదగిరిగుట్టలో నూతనంగా నిర్మించనున్న ప్రభుత్వ వైద్య కళాశాల స్థలాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించి, అక్కడ చేపట్టాల్సిన పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్య కళాశాల నిర్మాణ పనులు ఎప్పటి నుండి ప్రారంభించారని, ప్రస్తుతం చేపడుతున్న ఏర్పాట్ల పనులను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం వైద్య కళాశాల భవనానికి సంబంధించిన నమూనా మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు, వైద్య సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని అన్నారు. వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం డి. ఈ., తహశీల్దార్ పాల్గొన్నారు.

## మోటకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బంది అటెండన్స్ రిజిస్టర్ ను పరిశీలించారు. ఆసుపత్రిలో ఎంతమంది వైద్య సిబ్బంది పని చేస్తున్నారని ఆరా తీశారు. ఆసుపత్రికి చెకప్ కోసం వచ్చిన గర్భిణులతో కలెక్టర్ మాట్లాడుతూ రెగ్యులర్ గా వచ్చి చెకప్ చేయించుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ రాజేంద్రప్రసాద్, యంపిడిఓ ఇందిర, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సు

**- హాజరైన ఎస్పీ నరసింహ**




<u>ముద్ర, నడిగూడెం:</u>

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం సూర్యాపేట జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో నడిగూడెం మండల పరిధిలోని వల్లాపురం గ్రామంలో సైబర్ నేరాల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నరసింహ హాజరై మాట్లాడారు. నేరరహిత సమాజ నిర్మాణం, పౌరుల బాధ్యతకు సంబంధించిందని అన్నారు. అధిక డబ్బు సంపాదించాలనే అత్యాశకు పోయి చాలా మంది యువత సైబర్ మోసగాళ్ల ద్వారా డబ్బును పొంది సైబర్ నేరాల్లో చిక్కుకున్నారని తెలిపారు. ప్రస్తుత సమాజానికి డ్రగ్స్ అనే చీడపీడ పట్టిందని, డ్రగ్స్ ను సమాజం నుండి ప్రారదోలాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. రాష్ట్ర పోలీసు ప్రతిష్టాత్మకంగా అరైవ్ అలైవ్ అనే రోడ్డు భద్రత కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. మహిళల భద్రతకు పోలీసు శాఖ అధిక ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. వేధింపులపై డయల్ 100కు ఫోన్ చేస్తే పోలీ సులు బాధితుల ఇంటి వద్దకు వెళ్ళి పిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరిత, కోదాడ డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సైబర్ సెక్యూరిటీ సెల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, మునగాల సర్కి ల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, నడిగూడెం ఎస్ఐ అజయ్ కుమార్, మునగాల ఎస్ఐ ప్రవీణ్ కుమార్, కోదాడ ట్రాన్స్పోర్ట్ ఇన్స్పెక్టర్ రామాచారి, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, యువత, మహిళలు పాల్గొన్నారు

## ప్రతి మహిళా బాధ్యతగా మొక్కలు నాటాలి

<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి :</u>




ప్రతి మహిళా బాధ్యతగా మొక్కలు నాటాలని చైర్ పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బుధవారం భువనగిరి చెరువు కట్ట వద్ద గల 14 ఎకరాల ఎస్ఎల్ఎన్ఎస్ అర్బన్ పార్క్ ఓపెన్ స్పేస్ లో అమృత్ మిత్ర విమెన్ ఫర్ ట్రీస్ మొక్కలు నాటారు. వార్డు సభ్యులు జాలిగం విగ్నేష్, టి.ఎం.సి శ్యామల, సి ఓ సువర్ణ, మహిళలు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి :</u>




మండలంలోని తాజ్ పూర్ గ్రామ ఎంపి యుపిఎస్ పాఠశాలలో స్వపరి పాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, పంచాయతీ కార్యద ర్శి బి నరేందర్, ఉప సర్పంచ్ వరి గంటి కృష్ణ, ఎఎంసి చైర్మన్ వరి గంటి రమ్య, వార్డు సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులుతదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్టేషనరీ పంపిణీ

<u>ముద్ర, తుర్కపల్లి:</u>




తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని జడ్‌పిహెచ్ఎస్ పాఠశాల లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సందర్భంగా అవసరమైన ఎగ్జామ్ ప్యాడ్లు, స్టేషనరీని బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కనక నాగరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు పరీక్షలను ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో రాయాలని ఆయన ఆకాంక్షిం చారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి తమ పాఠశాలకు మరియు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బాలమణి, ఉపాధ్యాయులు మరియు పలుగుల శిరీష, దుడుక కరుణాకర్ పాల్గొన్నారు.

# సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం




**- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

<u>ముద్ర, ప్రతినిధి భువనగిరి :</u>

సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తి, మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజులతో కలిసి ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహ రావు, పౌర సరఫరాల అధికారి రోజా రాణి, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## బీబీనగర్లో మహిళలకు సన్మానం..

<u>ముద్ర, బీబీనగర్:</u>

అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీబీనగర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో మాజీ ఎంపిపి, మాజీ జడ్పీటిసీ గోలి ప్రణీత పింగల్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో మహిళలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపిటీసీ గోలి నరేందర్ రెడ్డి, కాసుల అంజనేయులు గౌడ్, ఉపసర్పంచి గోలి నరసింహ రెడ్డి, వార్డు సభ్యులు, పింగల్ అన్న సేవాదల్ గౌరవ అధ్యక్షుడు కాసుల రఘునందన్ గౌడ్, అధ్యక్షుడు ఎండి మోయిన్ తదితరులు పాల్గొన్నారు.



## తుర్కపల్లిలో మహిళా దినోత్సవం..




<u>ముద్ర, తుర్కపల్లి:</u>

తుర్కపల్లి మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.పిలుపు సంస్థ, స్వర భారతి, రైతు నేస్తం, ఒంటరి మహిళల సమైక్య సంస్థలు, ఇన్నర్ వీల్ క్లబ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ భువనగిరి శాఖ అధ్యక్షురాలు లావణ్య మాట్లాడుతూ పురుషులలాగే మహిళలకు కూడా సమాన హక్కులు కల్పించాలని అన్నారు. ప్రతి మహిళ, బాలికకు హక్కులు, న్యాయం జరిగేలా సమాజంలో కార్యాచరణ ఉండాలని ఆమె పేర్కొన్నారు. మహిళల అభివృద్ధి కోసం ఇన్నర్ వీల్ క్లబ్ అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. అనంతరం జిల్లా బాలల రక్షణ కమిటీ చైర్పర్సన్ జయశ్రీ, కమిటీ సభ్యులు, స్వర భారతి, రైతు నేస్తం, ఒంటరి మహిళల సమైక్య ప్రతినిధులు, పిలుపు సంస్థ వ్యవస్థాపకుడు ఎం. జనార్దన్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఒంటరి మహిళలు మల్కాపురం గ్రామానికి చెందిన మరియమ్మ, పల్లెపహాడ్గ్రా మానికి చెందిన సంధ్యలను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో రైతులు చాడ కరుణాకర్ రెడ్డి, మానవ హక్కుల జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, రెడ్ క్రాస్ ప్రతినిధులు అంజయ్య, పిలుపు సంస్థ సిబ్బంది, 70 మంది గ్రామీణ మహిళలు పాల్గొన్నారు.




## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కమలాకర్ నామినేషన్

<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి :</u>

యాదాద్రి భువనగిరి జిల్లా కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొలుపుల కమలాకర్ నామినేషన్ దాఖలు చేశారు. సీనియర్ న్యాయవాదులు నాగారం అంజయ్య, వంగేటి విజయభాస్కర్ రెడ్డి, శెట్టిగారి శ్రీకాంత్ బలపరిచారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వివి గౌడ్, పి లింగారెడ్డి, గోదా వెంకటేశ్వర్లు, గవర్నమెంట్ ప్లీడరు చందుపట్ల రజనీ, బుగ్గ జయ, డి హరిప్రియ, కుక్కదువ్వ కృష్ణ, కుక్కదువ్వ సోమయ్య, ఉపాధ్యక్షులు రేణుక, శంకర్ గౌడ్, బాల మల్లేష్, ఎన్ విద్యాసాగర్, ఐలయ్య, సుధాగాని రవి, గాజుల భద్రయ్య పాల్గొన్నారు.

## బైక్ ను లారీ ఢీకొని ఒకరి మృతి

<u>ముద్ర, సూర్యాపేట:</u>

సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారి పై మోతె మండలం మామిళ్లగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బైక్ ను లారీ ఢీకొని ఒకరు మతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. తుమ్మలపల్లికి చెందిన సారంగి రామారావు(42), అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో బైక్ పై ఖమ్మం నుంచి సూర్యపేట వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రామారావు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
12.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**పిల్లల్లో వెంట్రుకలు తెల్లబడకుండా చిట్కాలు**

**కెమికల్ షాంపూలను తగ్గించాలి**

చాలా స్ట్రాంగ్ కెమికల్ షాంపూలు జుట్టు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. మైల్డ్ లేదా హెర్బల్ షాంపూలు వాడటం మంచిది.



# కాంగ్రెస్ దళితుల పక్షపాతి

- నేడు ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ ప్రమాణ స్వీకారం
- ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి :**

కాంగ్రెస్ పార్టీ దళితులకు పెద్దపీట వేసి వారి అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తుందని సిద్దిపేట కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 12న కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ గా ఖమ్మంపల్లి సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయనున్నారని తెలిపారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం హైదరాబాద్ లోని గాంధీభవన్ లో జరుగుతుందని, సీఎం రేవంత్ రెడ్డి తో పాటు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్లు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా నుండి అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుట్ల యేసు ,కొత్తూరి నరహరి, ముత్యాల యాదగిరి, బొడ్డు బాలరాజు, పుట్ల ప్రసాద్, మందాల దాసు, బూరుగుపల్లి సర్పంచ్ బాలయ్య, బయ్యారం యాదగిరి, కృష్ణ, యాదగిరి, కృష్ణ, శ్రీను, తిరుపతి,మల్లయ్య శ్రీను బాబు తదితరులు పాల్గొన్నారు.





# మహిళలు ఆర్థికంగా పట్టు సాధించాలి

- మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎమ్మెల్యే సునీత రెడ్డి
- కలెక్టరేట్ లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మహిళలకు ఆర్థిక అంశాలపై పట్టు సాదిస్తే సమాజం బాగుపడుతుందని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్లో ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మెదక్, నర్సాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యం, మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం, సమాజం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు.

**పోరాటాలతో హక్కులు: ఎమ్మెల్యే సునీత రెడ్డి**

మహిళకు, పురుషులకు గతంలో చాలా వ్యత్యాసాలు ఉండేవి, ఓటు హక్కు కూడా లేదని, వీటిపై పోరాటం చేయడం వల్ల మహిళలకు హక్కులు కల్పించబడ్డాయని నర్సాపూర్ ఎమ్మెల్యే వి. సునీత రెడ్డి అన్నారు. గతంలో మహిళా కమిషనర్ గా ఉండి పురుషులకు మహిళల హక్కుపై అవగాహన కల్పించినట్లు గుర్తు చేశారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. మహిళల సాధికారత కోసం సమాజం మొత్తం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు వచ్చి సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళలకు శాలువ, మెమెంటోతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మి, డీడబ్ల్యుఓ హేమ భార్గవి, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డీఆర్డిఓ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు మాధవి, విజయలక్ష్మి, నీలిమ, అల్లాదుర్గ్ సీఐ రేణుక రెడ్డి, ఏఎస్ఐ రుక్సానా, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు దొంతి నరేందర్, కార్యదర్శి రాజ్ కుమార్, మహిళా ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఒత్తిడి లేకుండా పరీక్షలకు వెళ్లాలి

- ఓయూ ప్రొఫెసర్ డా.జే.వివేక్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

10వ తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసేందుకు వెళ్లాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డా.జే. వివేక్ వర్ధన్ సూచించారు. పరీక్ష హాల్లో ప్రశ్న పత్రాన్ని జాగ్రత్తగా చదివి, ప్రజెంటేషన్ బాగా చేయాలని, రాబోయే నెల రోజులు కష్టపడి, ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.మధు మోహన్ మాట్లాడుతూ... విద్యార్థులకు 10వ తరగతి చాలా కీలకమన్నారు. మీరు వ్రాసే మొట్టమొదటి బోర్డు పరీక్ష కాబటి క్లిష్టం అయిన విషయాలపై దృష్టి సాధించాలన్నారు. 100 శాతం రిజల్ట్ వచ్చే విధంగా కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మహిళ భద్రతకు షీ టీమ్స్ : ఎస్ఐ సునీల్

**ముద్ర, నిజామాబాద్:**

మహిళల భద్రత, వేధింపుల నివారణ కోసం 24 /7 పని చేస్తుందని ఎస్ఐ సునీల్ అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో విద్యార్థులకు షి టీమ్స్ ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈవ్ టీ జింగ్, వేధింపులకు పాల్పడి వారిని పట్టుకోవడం కౌన్సిలింగ్ ఇవ్వడం చట్టపరమైన చర్య తీసుకోవడం అలాగే బడులు, కళాశాలలో అవగాహన కార్యమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. షీ టీమ్స్ బహిరంగ ప్రదేశాలు, బస్ స్టాప్ లో, కాలేజీల వద్ద మహిళను వేధించవారిని సివిల్ డ్రెస్ లో ఉండి పట్టుకుంటారన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవడంలో షీ టీమ్స్ చురుకుగా వ్యవహరిస్తుందన్నారు. సైబర్ నేరాలు పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్స్ ఏఎస్ఐ ఆశయ్య, రేణుక, ఉపాధ్యాయులు బర్ల సాయిలు, విద్యార్థులు తదితరులు ఉన్నారు






# ప్రభుత్వ లక్ష్యాలను అమలు చేయాలి

- ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికపై నేడు ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమం

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై అవగాహన కల్పించేందుకు జిల్లాలోని మున్సిపల్ చైర్పర్సన్లు, వైస్ చైర్పర్సన్లు, గ్రామ పంచాయతీల సర్పంచులు, మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్లకు ఒక రోజు ఒరియంటేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించిందని, ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులకు కార్యక్రమ లక్ష్యాలు, అమలు విధానం, ప్రభుత్వ ఫ్లాగ్షిప్ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఒరియంటేషన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మార్చి 12న ఉదయం 10 గంటలకు కందిలోని ఎల్.ఎన్. కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మున్సిపల్ చైర్ పర్సన్లు, వైస్ చైర్పర్సన్లు, గ్రామ పంచాయతీల సర్పంచులు, మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్లు ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా కోరారు.




# టెన్త్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

**ముద్ర ప్రతినిధి మెదక్:**

పాపన్నపేట మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్టేషనరీ అందజేశారు. మెదక్ యంగ్ స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులకు ఈ ప్యాడ్ లు అందజేస్తున్నట్లు యంగ్ స్టార్ ఫౌండేషన్ సభ్యులు రాగి వనజ, సుమన, సౌమ్య, రాణి తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, దత్తురావు, శివకుమార్ పాల్గొన్నారు.



# పదేళ్ల బాలికపై అత్యాచారయత్నం

**ముద్ర, మెదక్:**

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామంలో పదేళ్ల బాలికపై అత్యాచారయత్నం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. సికింద్లాపూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులు (20) అదే గ్రామానికి చెందిన బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. ఇది గమనించిన స్థానికులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. బాధితురాలు, ఆమె కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

# పటిష్టంగా సింగూర్ డ్యాం

- నాణ్యతగా ఆనకట్ట పనులు
- నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**

సింగూర్ ప్రాజెక్ట్ ఆనకట్ట పనులను పరిశీలిస్తున్న నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ టీమ్ సింగూర్ ప్రాజెక్ట్ ఆనకట్ట పనులు మరో యాబై సంవత్సరాల పాటు పటిష్టంగా ఉండే విదంగా నాన్యతతో కూడిన పనులను చేయాలని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ టీం చైర్మన్ విజయ్ త్రయంబక్ దేశాయ్ అన్నారు. బుధవారం సింగూర్ ప్రాజెక్ట్ అనకట్ట పనులను నేషనల్ డ్యాం సేఫ్టీ బృదంతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లడారు. ఆనకట్ట రివిట్ మెంట్ 6 కిలోమీటర్ల వరకు కుంగిపోవడంతో ప్రాజెక్టుకు ఏలాంటి ప్రమాదం జరుగకుండా నేషనల్ డ్యాం సేస్టి అథారిటి సూచనల మేరకు ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ప్రజలకు త్రాగు నీటికి ఇంబ్బంది లేకుండా 8 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ఈ పనులను వచ్చే జూన్ నెల వరకు పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేయాలని ఇరిగేషన్ అధికారులకు తెలిపారు. అవసరమైతే నీటిని దశల వారిగా దిగువకు విడుదల చేస్తామని అన్నారు. పనులు జరుగుతున్నందున రైతులకు క్రాఫ్ హాలీడే ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటి బృందం సభ్యులు మురళిదర్, సతీష్ కుమార్, రెగొండ, శ్రీకాంత్, రాజు, లక్ష్మణ రావ్, ఇరిగేషన్ శాఖ సీఈ రాజమ్మ, ఎస్ఈ రఘునాథ్ రావ్, ఈఈ భీమ్, డీఈ నాగరాజులు ఉన్నారు.



# పట్టుదలతో లక్ష్యాలు సాధించాలి

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ప్రతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి తమ జీవితంలో అనుకున్న లక్ష్యాలు సాధించాలని అక్కన్నపేట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ అన్నారు. బుధవారం జడ్పీహెచ్ఎస్ అక్కన్నపేట పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు ఏర్పాటు చేశారు. పరీక్షల మధ్యలో వచ్చిన సెలవులను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు.





# గోల్కొండ పాఠశాలలో స్వయం పాలన

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ పట్టణం గోల్కొండ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజగోపాల్, ఉపాధ్యాయులు అర్చన, రజని, రోజా, పర్యవేక్షించారు. డీఈఓగా అహద్, ఎంఈఓగా ఆహర్జిత్ గౌడ్, హెచ్ఎంగా భరత్, పిఈటిగా శ్రవణ్, ఉపాధ్యాయులుగా మహిక, సుమేర, సహర్షిత, శృతి, సుమతి, స్పందన, సాత్విక్ లు వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

# సిండి కేటుగాళ్లు

- ధరలను అమాంతం తగ్గిస్తున్న వైనం
- తీవ్ర ఆందోళనలో ఎర్రజొన్న రైతులు

**ముద్ర, నిజామాబాద్ :**

ఎర్రజొన్న రైతులకు విత్తన వ్యాపారుల సిండికేట్ మళ్లీ దెబ్బతీస్తోంది. వ్యాపారులు కూడబలుక్కుని ధరలను అమాంతం తగ్గించడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వారం రోజుల వ్యవధిలోనే క్వింటాల్కు దాదాపు రూ.500 వరకు ధర పడిపోవడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. ఇటీవల వరకు క్వింటాల్కు రూ.3,900 వరకు పలికిన ఎర్రజొన్న ధర ప్రస్తుతం రూ.3,450కి పడిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని వ్యాపారుల సిండికేట్పై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఎర్రజొన్న వ్యాపారుల ఆగడాలను నియంత్రించేందుకు బైబ్యాక్ ఒప్పందాల విధానం అమలు చేశారు. విత్తనాలు ఇచ్చే వ్యాపారులు ముందుగానే రైతులతో ధర ఖరారు చేసి, అదే ధరకు పంట కొనుగోలు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు సాగాయి. అయితే ప్రస్తుతం అలాంటి నియంత్రణలు లేకపోవడంతో వ్యాపారులు మళ్లీ సిండికేట్ గా మారి ధరలను నియంత్రిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
12.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**పిల్లల్లో వెంట్రుకలు తెల్లబడకుండా చిట్కాలు**

ఆమ్లా (ఉసిరి) ఉపయోగించాలి
ఉసిరిలో విటమిన్-C ఎక్కువగా ఉంటుంది. ఉసిరి పొడి, ఉసిరి జ్యూస్ లేదా ఉసిరి ఆయిల్ ఉపయోగించడం జుట్టు ఆరోగ్యానికి మంచిది.





## ఎస్టీలకు మెజార్టీ డైరెక్టర్ పోస్టులు

- **సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధనలో ఆదివాసీలు భాగస్వాములవ్వాలి**
- **పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
త్వరలోనే ఎస్టీ సమాజానికి మెజారిటీ డైరెక్టర్ పోస్టులు ఇవ్వబోతున్నట్లు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ఆదివాసుల అభివృద్ధి, అటవీ హక్కులు, భూమి హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడిన పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని చెప్పారు. తెలంగాణలో సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధనలో ఆదివాసి సమాజం కీలక భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ యువతకు విద్య, ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. రాహుల్ గాంధీ ఆకాంక్షించిన సామాజిక న్యాయాన్ని అగ్రవర్ణానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్ధంగా అమలు చేస్తున్నారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 70 శాతం డీసీసీలు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చామన్న ఆయన ఇందులో ఐదుగురు ఎస్టీ నేతలకు డీసీసీ అధ్యక్ష పదవులు ఇచ్చామని వివరించారు. లంబాడీలు ఎక్కువగా ఉన్న తన స్వగ్రామంలో పాఠశాల నిర్మాణం కోసం 11 ఎకరాల భూమిని ఇచ్చినట్లు చెప్పారు. ఆదివాసి హక్కుల పరిరక్షణ, వారి జీవన ప్రమాణాల మెరుగుదల కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. ప్రధాని పదవిని త్యాగం చేసిన మహనీయులు సోనియా గాంధీ అన్నారు. దేశం కోసం ప్రధాని కావాలని సీఎం రేవంత్ రెడ్డి అడగ్గానే మొదటిసారి రాహుల్ గాంధీ ఆ పదవి చేపడుతానని అన్నారని గుర్తు చేశారు. దేశ ప్రజల సంరక్షణ కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం అట్టడుగు వర్గాల అభ్యున్నతేనని చెప్పారు. రాహుల్ గాంధీ ఆలోచనకు అనుగుణంగా తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి కులగణన సర్వే నిర్వహించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల వివరాలను అధికారికంగా నమోదు చేశారని పేర్కొన్నారు.

## పేదలందరికీ సొంతిళ్లు

- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
- **వెలుగుమట్ల బాధితులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ**

**ముద్ర, ఖమ్మం:**
పేదలందరికీ సొంతిల్లు ఉండాలని క్యాబినేట్ నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. బుధవారం వెలుగుమట్ల బాధితులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వివాదస్పదంగా మారిన ఖమ్మం జిల్లా వెలుగుమట్ల నిర్వాసితుల్లో 412 మందిని అధికారికంగా గుర్తించామన్నారు. వెలుగుమట్లలో ప్రభుత్వమే దగ్గర ఉండి భూమి పూజ చేయించి ఇండ్ల నిర్మాణం మొదలు పెడుతుందన్నారు. డిసెంబర్ 9 న సీఎం రేవంత్ రెడ్డిని ఖమ్మం ఆహ్వానించి లబ్దిదారులతో గృహప్రవేశం చేయిస్తామని తెలిపారు. ప్రభుత్వం పై బురద జల్లే ప్రయత్నాలు బీఆర్ఎస్ చేసిందని విమర్శించారు.



**గత నెలలో బాధితులు .. నేడు లబ్దిదారులు: పొంగులేటి**
గత నెలలో బాధితులుగా ఉన్న వెలుగుమట్ల నిర్వాసితులు నేడు ఇందిరమ్మ లబ్దిదారులుగా మారారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నష్ట పోయిన ప్రతి వారిని ఈ ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. 311 మందికి ఇండ్ల స్థలంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, 101 మందికి వారి సొంత స్థలంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పారు.

**పేదలను నమ్మించి బోగస్ పట్టాలు: మంత్రి తుమ్మల**
పేదలను ముందు పెట్టి దళారులు దోపిడి చేశారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. 31.7 ఎకరాల భూమిలో బోగస్ హౌస్ సైట్ పట్టాలు ఇచ్చారని తెలిపారు. భూదాన్ ట్రస్ట్ సీసీఎల్ఎ కు బదాలయించినట్లు చెప్పారు.

## పొగాకు రహిత సమాజ నిర్మాణంలో మీడియా పాత్ర కీలకం


**ముద్ర, హైదరాబాద్ :**
ధూమపానం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని నిపుణులు సూచించారు. 'నో స్మోకింగ్ డే' సందర్భంగా బుధవారం కవాడిగూడలో పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) ఆధ్వర్యంలో మీడియా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీగణ మాట్లాడుతూ ధూమపానం వల్ల క్షయ వ్యాధి సహా అనేక వ్యాధుల ముప్పు పెరుగుతుందని చెప్పారు. పొగాకు వినియోగం వల్ల శరీరంలోని కీలక అవయవాలు దెబ్బతింటాయని తెలిపారు. ఎన్‌టీఈపీ ఐఈసీ అధికారి ఎస్. జితేంద్ర మాట్లాడుతూ ధూమపానం చేసే వారికే కాకుండా వారి పొగను పీల్చే ఇతరుల ఆరోగ్యానికీ హానికరమని అన్నారు. సమాజంలో క్షయ వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించడంలో మీడియా పాత్ర ముఖ్యమని పేర్కొన్నారు.



పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ మాట్లాడుతూ పొగాకు వినియోగాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడంలో మీడియా చురుకుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఐబీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, పొగాకు నిర్మూలన కార్యకర్త మాచన రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్లకు ముహూర్తం ఫిక్స్..?

- **నియోజకవర్గాల పునర్విభజనకు ముందే అమలు**
- **బడ్జెట్ మలి విడత సమావేశాల్లోనే రిజర్వేషన్ల చట్టం**
- **సవరణ బిల్లుకు ఆమోదం తెలిపేందుకు కేంద్రం సన్నద్ధం**




**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
ఏండ్ల నుంచి ప్రధాన డిమాండ్ గా ఉన్న మహిళా రిజర్వేషన్ల చట్టం అమలు దిశగా కేంద్రం వడివడిగా అడుగులు వేస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనకు ముందే ఈ చట్టాన్ని అమలు చేయాలని భావిస్తుంది. పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్ని సవరించాలని భావిస్తోన్న కేంద్ర ప్రభుత్వం.. ఏప్రిల్ 2 వరకు జరగనున్న బడ్జెట్ మలి విడత సమావేశాల్లోనే మహిళా రిజర్వేషన్ చట్టం సవరణ బిల్లును ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నది. ఈ మేరకు సాధ్యాసాధ్యాలు, అవకాశాలను పరిశీలిస్తున్నట్లు కేంద్ర అధికారిక వర్గాలు తెలిపారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్న కేంద్రం ఈ మేరకు కసరత్తు చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

**2023లోనే ఆమోదం..**
మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే మహిళా రిజర్వేషన్ చట్టం 2023లో ఆమోదం పొందింది. ఈ బిల్లు సెప్టెంబర్ 20న లోక్‌సభలో, సెప్టెంబర్ 21న రాజ్యసభలో ఆమోదం పొందంగా ఆ వెంటనే రాష్ట్రపతి ఆమోదించారు. వాస్తవానికి జనాభా గణన, నియోజక వర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తయిన తర్వాతే అమలు చేస్తామని మహిళా రిజర్వేషన్ బిల్లులోని నిబంధనలు చెబుతున్నాయి. జనగణన ఆలస్యం కావడం, ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ఆలస్యంతో 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి ఈ బిల్లు అమల్లోకి వస్తుందని అంచనా వేశారు. కానీ అప్పటి జనగణన, పునర్విభజన ప్రక్రియ కోసం వేచి చూడకుండానే మరో రాజ్యాంగ సవరణ ద్వారా మహిళా రిజర్వేషన్లు అమలు చేసే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

**తెలుగు రాష్ట్రాల్లో పెరగనున్న మహిళా ప్రాతినిధ్యం..**
మహిళా రిజర్వేషన్ బిల్లు అమల్లోకి వస్తే అసెంబ్లీ, లోక్ సభలో మహిళల ప్రాతినిధ్యం పెరగనుంది. తెలంగాణలో ప్రస్తుతం 119 శాసనసభ స్థానాలు ఉండగా వీటిలో సుమారు 40 శాతం సీట్లు మహిళలకు కేటాయించాల్సి ఉంటుంది. లోక్ సభకు 17 స్థానాలు ఉంటే సుమారు 56 సీట్లు మహిళాలకు దక్కనున్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్ లో 175 శాసనసభ స్థానాలు ఉంటే ఇందులో మహిళలకు సుమారు 5758 సీట్లు, 25 లోక్ సభ స్థానాల్లో 8 మహిళలకు దక్కనున్నాయి. ఇదిలా ఉంటే నియోజకవర్గాల పునర్విభజన జరిగితే రెండు తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్య పెరగాల్సి ఉంది. ఇలా జరిగితే మహిళల ప్రాతినిధ్యం మరింత పెరిగే అవకాశం ఉంది.

# నూతన గవర్నర్ గా శివ ప్రతాప్ శుక్లా

- **ప్రమాణ స్వీకారం చేయించిన హైకోర్టు సీజే**
- **తులుగులో ప్రమాణం చేసిన గవర్నర్**
- **హాజరైన సీఎం, మంత్రులు, ప్రముఖులు**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
రాష్ట్ర నూతన గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం లోక్ భవన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ శివ ప్రతాప్ శుక్లాతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా శివప్రతాప్.. తెలంగాణ గవర్నర్ గా తన బాధ్యతలను శ్రద్ధతో నిర్వహిస్తానని తెలుగులో ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ఆయనకు పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు, సీఎస్ రామకృష్ణారావు, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారానికి ముందు వందేమాతం, జనగణమన ఆలపించారు. 73 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ నేపథ్యం కలిగిన శివ్ ప్రతాప్ శుక్లా ఉత్తరప్రదేశ్ వాస్తవ్యుడు. ఏబీవీపీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకెళ్లారు. యూపీలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, కేబినెట్ మంత్రిగా, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 20232026 మధ్య హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా తెలంగాణకు వచ్చారు. ఇప్పటి వరకూ రాష్ట్రానికి గవర్నర్ గా ఉన్న జిష్ణు దేవ్ వర్మ మహారాష్ట్రకు బదిలీపై వెళ్లారు.



## అమెరికా దురాక్రమణతో ప్రపంచ శాంతికి ముప్పు

- **సీపీఐ జాతీయ నియంత్రణ కమిషన్ చైర్మన్ కె. నారాయణ**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
అమెరికా దురాక్రమణ విధానాలు ప్రపంచ శాంతికి తీవ్ర ముప్పుగా మారుతున్నాయని సీపీఐ జాతీయ నియంత్రణ కమిషన్ చైర్మన్ కె. నారాయణ అన్నారు. ఇరాన్‌పై జరుగుతున్న సైనిక దాడులను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. యుద్ధాల వల్ల సాధారణ ప్రజలే ఎక్కువగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని మఖ్దూమ్ భవన్‌లో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతూ సామ్రాజ్యవాద విధానాలను వ్యతిరేకించే దేశాలు, ముఖ్యంగా రష్యా మరియు చైనా కలిసి యుద్ధ పరిస్థితులను అరికట్టేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. క్యూబాపై అమెరికా ఆర్థిక నిర్బంధం కారణంగా అక్కడి ప్రజలు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నప్పటికీ ధైర్యంగా పోరాటం కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న యుద్ధ వాతావరణంపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, ప్రజల సమస్యలపై వామపక్ష ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. యువత, కార్మిక వర్గాలను పెద్ద ఎత్తున ఉద్యమాల్లోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

# రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్

- **తెలంగాణలో మూడో డిస్కం ఏర్పాటు**
- **ఉత్తర్వులు జారీ**
- **వ్యవసాయం, ప్రజా అవసరాలకు విద్యుత్ పర్యవేక్షణ**
- **వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు**
- **భారీ, మధ్య తరహా ఎత్తిపోతల ప్రాజెక్టులకు విద్యుత్ సరఫరా**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
రాష్ట్ర విద్యుత్ రంగంలో ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న రెండు విద్యుత్ పంపిణీ సంస్థలకు అదనంగా, మూడో డిస్కంను ఏర్పాటు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త సంస్థకు తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ అని పేరు ఖరారు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కొత్తగా ఏర్పడిన ఈ డిస్కం బాధ్యతలను ప్రభుత్వం సమర్థవంతమైన అధికారులకు అప్పగించింది. సీనియర్ ఐఏఎస్ అధికారి ముషారఫ్ అలీ ఫరూఖీని ఈ సంస్థకు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది. ఆయనతో పాటు సంస్థ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు మరో నలుగురు డైరెక్టర్లను కూడా ప్రభుత్వం నియమించింది. ఈ కొత్త డిస్కం కేవలం సాధారణ విద్యుత్ పంపిణీకే పరిమితం కాకుండా, ప్రత్యేకంగా వ్యవసాయం, ప్రజా అవసరాలకు సంబంధించిన విద్యుత్ సరఫరాను పర్యవేక్షించనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల నిర్వహణ, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించనుంది. రైతులు కోరుకునే కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేయనుంది. రాష్ట్రంలోని భారీ, మధ్య తరహా ఎత్తిపోతల ప్రాజెక్టులకు విద్యుత్ సరఫరా చేయనుంది. ఇక మిషన్ భగీరథ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, మున్సిపల్ వాటర్ సప్లై స్కీమ్‌లకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లను ఈ డిస్కం పర్యవేక్షించనుంది. కాగా, సాధారణ వినియోగదారులు, పరిశ్రమల విద్యుత్ అవసరాల నుంచి వ్యవసాయం భారీ ప్రభుత్వ ప్రాజెక్టుల విద్యుత్ లోడ్‌ను వేరు చేయడం ద్వారా అడ్మినిస్ట్రేషన్ మరింత సులభం అవుతుందని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. దీంతో రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా వేగంగా పరిష్కారం లభించే అవకాశం ఉంది. రాష్ట్ర విభజన తర్వాత విద్యుత్ రంగంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అతిపెద్ద సంస్కరణల్లో ఇది ఒకటిగా నిలవనుంది.

# తెలంగాణ వరికి కేంద్రం మద్దతు

- **రబీలో నుంచి 1,25,855 మె. టలకు కనీస మద్దతు ధర**
- **తెలంగాణ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆమోదం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
రబీ సీజన్‌కు తెలంగాణలో 1,25,855 మెట్రిక్ టన్నుల పంటను కనీస మద్దతు ధర వద్ద సేకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆమోదం తెలిపారు. ఈ పంటల సేకరణను ధర మద్దతు పథకం కింద చేపట్టనున్నారు. ఇందులో భాగంగా 29,860 మెట్రిక్ టన్నుల శనగలు, 37,020 మెట్రిక్ టన్నుల మినుములు, 55,285 మెట్రిక్ టన్నుల వేరుశనగ, 3,690 మెట్రిక్ టన్నుల పొద్దుతిరుగుడు పువ్వు కొనుగోలు చేయనున్నారు. ఈ సేకరణ విలువ రూ. 894 కోట్లకు పైగా ఉంటుంది. రైతులను మార్కెట్ ఒడిదుడుకుల నుంచి రక్షించి వారి కష్టానికి తగిన పూర్తి ధర లభించేలా చూడటమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ ఆమోదంతో తెలంగాణ రైతులు పంటకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తికి కొత్త ఉత్తేజం లభిస్తుందని పేర్కొన్నారు. దేశంలోని ప్రతి రైతు చేసిన కష్టానికి తగిన గౌరవం, విలువ దక్కాలన్నదే తమ సంకల్పమని స్పష్టం చేశారు. కేంద్రం రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయటం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికి కేంద్రం తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. ఈ నిర్ణయంతో రైతులు ఉత్పత్తులను తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. తెలంగాణలో శనగలు, మినుములు, వేరుశనగ, పొద్దుతిరుగుడు పంటలను సాగు చేసే రైతులకు నేరుగా ప్రయోజనం చేకూరుతుంది. ఇది రాష్ట్ర వ్యవసాయ రంగంలో స్థిరత్వం, భద్రత, సమృద్ధికి ఒక కొత్త దిశను నిర్దేశిస్తుంది.



పిల్లల్లో వెంట్రుకలు తెల్లబడకుండా చిట్కాలు

తగినంత నిద్ర అవసరం పిల్లలు రోజుకు కనీసం 8–9 గంటలు నిద్రపోవాలి. సరైన నిద్ర లేకపోతే శరీరంలోని హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది.

# అత్తాపూర్ శివాలయం వద్ద ఉద్రిక్తత

- రంగంలోకి హైడ్రా కమిషనర్ రంగనాథ్
- స్వాధీనం చేసుకుంటామని చెప్పడంతో సద్దుమణిగిన గొడవ

**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:**

శివాలయం భూములను కబ్జా చేస్తున్న అధికారులు స్పందించడం లేదని బుధవారం స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళితే అత్తాపూర్ లోని చిన్న అనంతగిరి శివాలయం ముందు భాగంలో ఉన్న ప్రభుత్వ భూమి 354/1 సర్వే నెంబర్ లో ఉన్న ఒక టిన్నర ఎకరాల భూమి విషయంలో కోర్టులో కేసు ఉంది. ఈ వివాద విషయాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ కు హైకోర్టు సూచించింది. అయితే సిక్కు మతం వారు నాలుగు రోజులుగా ఇక్కడ కంచె వేసి స్థలాన్ని కబ్జా చేసుకునే ప్రయత్నం చేశారు. దీంతో స్థానికులు రెండు రోజులుగా ఆలయం వద్ద ధర్నా చేశారు. సిక్కులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఆర్డీవో, పోలీసులకు ఫిర్యాదులు చేశారు. అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో బుధవారం ఆందోళన చేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.



**స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం**
**హైడ్రా కమిషనర్ రంగనాథ్**

అత్తాపూర్ శివాలయం వద్ద పరిస్థితులు చేయి దాటిపోవడంతో సమాచారం అందుకున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ అక్కడికి చేరుకున్నాడు. ధర్నా చేస్తున్న వారితో మాట్లాడి అక్కడి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గురుద్వారా ప్రబంధక్ కమిటీ సభ్యులతో కూడా మాట్లాడి విషయం తెలుసుకున్నారు. సదరు భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉన్నదని ఎవరు కబ్జాలు చేసిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇట్టి ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైడ్రా ఉన్నదే భూములను కాపాడడానికి అన్నారు. ఈ విషయంలో ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని స్పష్టం చేయడంతో స్థానికులు ఆందోళన విరమించారు.

## ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు టీబీజేపీ ఎంపీల వినతి**

**నేషనల్ డెస్క్:**

గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్ ఉద్యోగుల పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ బీజేపీ ఎంపీలు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. తెలంగాణకు చెందిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌తో కూడిన ఎంపీల బృందం బుధవారం న్యూఢిల్లీలో నిర్మలా సీతారామన్ తో భేటీ అయింది. ఈ సందర్భంగా ఆర్ఆర్‌బీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక పదోన్నతుల సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



ఆర్ఆర్‌బీ ఉద్యోగుల కెరీర్‌లో ఎదుగుదల నిలిచిపోవడం అనేది గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని, ఉద్యోగుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా హెచ్‌ఆర్ విధానాల్లో తగిన సవరణలు చేపట్టాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

## వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

**రూ.8 లక్షల ఆస్తి నష్టం**

**ముద్ర, కాప్రా:**

కాప్రా సర్కిల్ పరిధిలోని సౌత్ కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం అనుమానాస్పద అగ్నిప్రమాదం సంభవించింది. స్థానిక అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు అప్రమత్తమై మొదట మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్ సహాయంతో సంఘటనా స్థలానికి చేరుకుని పూర్తిగా మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో కార్యాలయంలోని ఫర్నీచర్, పత్రాలు, ఇతర సామగ్రి దగ్ధమవడంతో సుమారు రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా. అగ్నిప్రమాదం జరిగిన తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అసోసియేషన్ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 12:30 గంటల వరకు కార్యాలయంలోనే ఉన్నామని, అనంతరం ఇంటికి వెళ్లిన కొద్ది సమయంలోనే అగ్నిప్రమాదం జరిగిందని చెప్పారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు అసోసియేషన్ నాయకులు రాఘవరెడ్డి, సభ్యులు వెల్లడించారు. అగ్నిప్రమాదానికి కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టనున్నారు.

## భారత ప్రయాణీకులకు మలేసియా ఎయిర్‌లైన్స్ ప్రత్యేక ఛార్జీలు

**ముద్ర, హైదరాబాద్:**


భారత్‌లోని ప్రయాణీకుల కోసం మలేసియా ఎయిర్‌లైన్స్ ఈ నెల 10 నుంచి 23 వరకు ప్రత్యేక ఛార్జీలను ప్రకటించింది. ప్రత్యేక ఆల్ ఇన్ రిటర్న్ ఛార్జీలకు (తిరుగు ప్రయాణానికి వర్తించే అన్ని పన్నులు, రుసుములు, సర్‌ఛార్జీలు సహా కలిగిన తుదిమొత్తం) ఎకానమీ క్లాస్‌కు ప్రకటించింది. బుకింగ్‌లు మార్చి 23 వరకు అందుబాటులో ఉంటాయని, ఇది డిసెంబర్ 18 వరకూ చెల్లుబాటు అవుతుందని సంస్థ పేర్కొంది. ఈ బుకింగ్ పరిమిత కాలం మాత్రమే అందుబాటులో ఉన్నందున, ప్రయాణీకులు ముందస్తుగా తమ భవిష్యత్ ప్రయాణ ప్రణాళికలను ఖరారు చేసుకోవాలని సంస్థ కోరింది.



## భుక్తాయాసంతో పులి ఏం చేసిందంటే?

**ముద్ర, డెస్క్ :**

తెలుగు రాష్ట్రాల్లో అటవీ ప్రాంతాల్లో సంచరించే పులులు అకస్మాత్తుగా గ్రామాల్లోకి రావడం సర్వసాధారణమైంది. ఆంధ్రప్రదేశ్ లోని పోలవరం నియోజకవర్గంలో ఇటీవల పులి సంచరిస్తోందనే వార్తలు మీడియాలో విస్తృతంగా ప్రసారమయ్యాయి. పులి కదలికలను అటవీశాఖ అధికారులు సైతం అంచనా వేశారు. అడ్డతీగల మండల పరిధిలోని వీరభద్రపురం గ్రామం నుంచి కొనలోవ, కొట్టం పాలెం, గౌరయ్యపేట గ్రామాల్లో పులి సంచరించింది. అయితే ఓ ప్రాంతంలో ఆవుదూడను చంపి తినేసిన పులి, కడుపు నిండడంతో అడుగు కూడా ముందుకు వేయలేకపోయింది. దీంతో మనుషుల మాదిరిగానే దట్టమైన పచ్చిక మీద మేనువాల్చింది. భుక్తాయాసంతో అటూ, ఇటూ దొర్లడాన్ని అటవీశాఖాధికారులు డ్రోన్ ద్వారా చిత్రీకరించిన వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోను చూసిన నెటిజన్లు రకరకాలుగా కామెంట్ చేస్తున్నారు. పులి అంటే అడవికి రాజు అనుకున్నాం. మనుషుల కంటే ఎక్కువ బద్ధకం ఉన్న జంతువని తెలిసిందని పోస్టులు పెడుతున్నారు.



## గ్యాస్ సంక్షోభం.. హోటళ్లు, హాస్టళ్లపై యుద్ధ మేఘాలు

- **సామాన్యుడికి తప్పని భారాలు!**

**ముద్ర, డెస్క్ :**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధ ప్రభావం భారత్‌పై కూడా కనిపిస్తోంది. హోర్ముజ్ జలసంధిలో చమురు నౌకల రాకపోకలపై ఏర్పడిన ఆంక్షల కారణంగా కమర్షియల్ గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో దేశవ్యాప్తంగా హోటల్ పరిశ్రమ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. పెట్రోలియం కంపెనీలు కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను పరిమితం చేయాలని డీలర్లకు ఆదేశాలు జారీ చేశాయి. అత్యవసర సేవలుగా ఆస్పత్రులు, కొన్ని హాస్టళ్లకు మాత్రమే సిలిండర్లు అందించాలని సూచించడంతో హోటళ్లకు గ్యాస్ కొరత తీవ్రంగా మారింది. దీంతో ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో చిన్న చిన్న హోటళ్లు మూతపడుతున్నాయి. మరికొన్ని హోటళ్లు పరిమిత మెనూతో మాత్రమే కొనసాగుతున్నాయి. టిఫిన్ ధరలు ఒక్కసారిగా పెరగగా, వివాహ సీజన్‌లో విందు భోజనాలు కూడా నిలిపివేస్తున్నారు. క్యాటరింగ్ సేవలు ఒప్పందాలు రద్దు చేసుకుంటున్నాయి. హైదరాబాద్‌లోనే సుమారు 10 లక్షల మందిపై ఈ ప్రభావం పడుతున్నట్టు హోటల్ పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. గ్యాస్ సరఫరా త్వరగా సాధారణ స్థితికి రాకపోతే పరిస్థితి మరింత తీవ్రమయ్యే అవకాశముందని ఆందోళన వ్యక్తమవుతోంది.



## కూతురిపై అత్యాచారం చేసిన తండ్రికి 20 ఏళ్ల జైలు శిక్ష

**ముద్ర, వనపర్తి:**

కన్న కూతురిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నేరం రుజువవ్వడంతో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ వనపర్తి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్. సునీత బుధవారం తీర్పు ఇచ్చినట్లు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు.

వనపర్తి జిల్లా పానగల్ మండలానికి చెందిన వల్లెపోలు కురుమయ్య తన సొంత కూతురుకు బుక్కులు ఇప్పిస్తానని చెప్పి నమ్మించి, పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగాపురం గ్రామ సమీపంలో జూరాల కాల్వ వద్ద మే 3, 2025న మధ్యాహ్న సమయంలో అత్యాచారానికి పాల్పడ్డాడని, ఈ విషయాన్ని బాలిక తన తల్లికి తెలియజేయగా, తల్లి మే 7న పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న వెంటనే పెబ్బేరు ఎస్సై యుగంధర్ రెడ్డి కేసు నమోదు చేయగా, కొత్తకోట సీఐ రాంబాబు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సాంకేతిక ఆధారాలు సేకరించడం, బాధితురాలి వాంగ్మూలం నమోదు చేయడం అవసరమైన చట్టపరమైన చర్యలు పూర్తి చేశారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తరువాత కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాల మేరకు సీఐ రాంబాబు, ఎస్సై యుగంధర్ రెడ్డి, కోర్టు లైజనింగ్ అధికారి హెడ్ కానిస్టేబుల్ సత్యం, కోర్టు కానిస్టేబుల్ సంజీవయ్య సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసచారి సమర్థవంతంగా వాదనలు వినిపించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిందితుడిపై నేరం నిరూపితమైందని నిర్ధారించి తీర్పునిచ్చారు. ఈ కేసులో నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు డ్యూటీ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సమాజాన్ని కుదిపేసే నేరాలకు పాల్పడిన వారిపై న్యాయస్థానం కఠిన శిక్షలు విధించడం ద్వారా నేరస్తుల్లో భయం నెలకొంటుందని తెలిపారు. ఇలాంటి తీర్పులు సమాజానికి రక్షణ కవచం లాంటివన్నారు. నేరం చేయాలనే ఆలోచనకే నేరస్తుల్లో భయం కలిగించేలా న్యాయవ్యవస్థ వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో నేరాలకు పాల్పడిన వారిని చట్టం కఠినంగా శిక్షిస్తుందని, బాధితులకు న్యాయం అందించడంలో పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని తెలిపారు. ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదని, ఏ అన్యాయం జరిగినా వెంటనే పోలీసులను సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

## వనం వీడిన బస్తర్ క్యాడర్

- **పోలీసులకు లొంగిపోయిన 108 మంది స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు**
- **ఐదుగురు డివిజనల్ కమిటీ సభ్యులు, ఇద్దరు సీవైపీసీ కమాండర్లు**
- **రూ.3.61 కోట్ల లిక్విడ్ క్యాష్, కిలో బంగారం స్వాధీనం**
- **ఫలితమిస్తోన్న ఛత్తీస్ గడ్ పూనా మార్గెమ్**
- **26 నెలల్లో జనజీవనంలో కలిసిన 2,714 మంది మావోలు**

**ముద్ర, నేషనల్ డెస్క్ :**

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం చేపట్టిన 'పూనా మార్గెమ్ పునరావాసం నుంచి పునర్జీవనం' అనే కార్యక్రమం బస్తర్ ప్రాంతంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోంది. ఇందులో భాగంగానే బుధవారం బస్తర్ సంభాగ్ ముఖ్య కేంద్రం జగదల్‌పూర్‌లోని 'శౌర్య భవన్' పోలీస్ కోఆర్డినేషన్ సెంటర్ వేదికగా భారీ ఎత్తున మావోయిస్టుల సరెండర్ అయ్యారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన 108 మంది మావోయిస్టు క్యాడర్లు హింసామార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. వీరిలో 44 మంది మహిళా మావోయిస్టులు ఉండటం గమనార్హం. లొంగిపోయిన మావోయిస్టులపై ప్రభుత్వం మొత్తం రూ.3.29 కోట్ల రివార్డును ప్రకటించింది. సరెండర్ అయిన వారిలో రాహుల్ తేలాం, పండ్రూ కోవాసి, జితురూ ఓయామ్ వంటి ఐదుగురు డివిజనల్ కమిటీ సభ్యులు, ఇద్దరు సీవైపీసీ కమాండర్లు, 15 మంది ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యులున్నారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్ దేవ్ గౌతమ్, బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గత 26 నెలల్లో మొత్తం 2,714 మంది మావోయిస్టులు హింసను వీడి శాంతి మార్గంలోకి వచ్చారని ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరపున ఆర్థికసాయం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉపాధి కల్పిస్తామని భరోసానిచ్చారు. ఇంకా మిగిలి ఉన్న మావోయిస్టులు కూడా ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో చేరాలని వారు విజ్ఞప్తి చేశారు.

### హోటళ్లలో కట్టెల పొయ్యి గతి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నిర్మల్ జిల్లాలోని పలు హోటళ్లలో కట్టెల పొయ్యిపై వంటలు మొదలయ్యాయి. గత కొద్ది రోజులుగా ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో వాణిజ్య సిలిండర్ల సరఫరాపై కేంద్రం ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హోటల్ రంగం కుదేలైంది. పెట్టుబడుల వృథా వల్ల ఎదురయ్యే భయంతో హోటళ్లలో సాంప్రదాయిక పద్ధతిలో వంటలను మొదలు పెట్టారు. సిలిండర్ల ప్రవేశానికి ముందు కట్టెల పొయ్యిపై వండిన నేపథ్యంలో మళ్ళీ హోటళ్లలో కట్టెల పొయ్యిని వాడక తప్పని పరిస్థితి నెలకొంది. దీంతో వంట చెరకు ధరలు హఠాత్తుగా పెంచేశారు.



## స్పా ముసుగులో వ్యభిచారం

**ఆరుగురి రక్షణ, ముగ్గురు నిర్వాహకుల అరెస్ట్**

**ముద్ర కూకట్‌పల్లి :**

భాగ్యనగర్ పరిధిలోని కూకట్‌పల్లిలో స్పా సెంటర్ పేరుతో సాగుతున్న వ్యభిచార ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు కూకట్‌పల్లి పోలీసులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ బృందం మంగళవారం సాయంత్రం 'చార్మ్ బ్యూటీ స్పా'పై ఆకస్మిక దాడి నిర్వహించారు. పోలీసుల తనిఖీల్లో స్పా ముసుగులో అనైతిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు నిర్ధారణ అయ్యింది. ఈ దాడిలో ఆరుగురు బాధితులను పోలీసులు సురక్షితంగా కాపాడారు. ఘటనా స్థలంలో రిసెప్షన్ వద్ద ఉన్న ముగ్గురు నిర్వాహకులను అదుపులోకి తీసుకోగా, ఒక విటుడు పట్టుబడ్డాడు. పోలీసులు నిందితుల వద్ద నుండి 4 స్మార్ట్‌ఫోన్లు, రూ.9,100 నగదు, ఇతర అభ్యంతరకర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించి, తదుపరి విచారణ చేపడుతున్నారు.

స్పా లేదా వెల్‌నెస్ సెంటర్ల పేరుతో అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి యాజమాన్యం తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే లైసెన్సులు, ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలి. నిబంధనలు అతిక్రమిస్తే సంస్థలను మూసివేయడమే కాకుండా చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని కూకట్‌పల్లి పోలీసులు తెలిపారు.



ప్రజలు తమ పరిసరాల్లో ఇలాంటి అనుమానాస్పద లేదా అక్రమ కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

APEX SIF | ADITYA BIRLA CAPITAL ASSET MANAGEMENT

## ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ తొలి పెట్టుబడి వ్యూహం

- **కొత్త ఎస్ఐఎఫ్ ఫ్రేమ్‌వర్క్ కింద 'అపెక్స్ హైబ్రిడ్ లాంగ్-షార్ట్ ఫండ్'**
- **మార్చి 6 నుంచి 18 వరకు అందుబాటులో**

**ముంబై, ముద్ర:**

ఎస్ఐఎఫ్ కేటగిరీలో 'అపెక్స్ హైబ్రిడ్ లాంగ్‌షార్ట్ ఫండ్' పేరుతో తన తొలి పెట్టుబడి వ్యూహాన్ని ప్రారంభించినట్లు ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ లిమిటెడ్ (ఏబీఎస్ఎల్ఏఎంసీ) ప్రకటించింది. ఈ కొత్త ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఓ) మార్చి 6 నుంచి 18 వరకు సబ్స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉంటుంది. 1994లో స్థాపించబడిన ఏబీఎస్ఎల్ఏఎంసీ, ఆదిత్య బిర్లా క్యాపిటల్ లిమిటెడ్ మరియు సన్ లైఫ్ (ఇండియా) ఏఎంసీ ఇన్వెస్ట్మెంట్స్ ఇంక్. సంస్థల ప్రోత్సాహంతో పనిచేస్తోంది. ఇండియన్ ట్రస్ట్స్ యాక్ట్-1882 కింద నమోదైన ఆదిత్య బిర్లా సన్ లైఫ్ మ్యూచువల్ ఫండ్ కు ఇది ఇన్వెస్ట్మెంట్ మేనేజర్‌గా ఉంది.రూ.10 లక్షల కనీస పెట్టుబడితో, విభిన్న పోర్ట్‌ఫోలియో వ్యూహాలను అన్వేషించే పెట్టుబడిదారుల కోసం ఈ ఫండ్ రూపొందించబడింది. లాంగ్-షార్ట్ విధానాన్ని అనుసరిస్తూ అధునాతన రిస్క్ మేనేజ్‌మెంట్ ద్వారా మార్కెట్ అస్థిరతను సమర్థంగా ఎదుర్కొని నష్టాలను తగ్గించడం దీని లక్ష్యం.కోర్ ఈక్విటీలతో పాటు కార్పొరేట్ చర్యలు, ప్రత్యేక పరిస్థితుల ద్వారా వచ్చే అవకాశాలను వినియోగించి వ్యూహాత్మక ఆల్ఫా సాధించడమే ఈ ఫండ్ ఉద్దేశం. పెట్టుబడిదారులకు ఈక్విటీ తరహా పన్ను ప్రయోజనాలు కూడా లభిస్తాయి. 12 నెలలకు పైగా పెట్టుబడి ఉంటే దీర్ఘకాలిక మూలధన లాభాలపై 12.5% పన్ను (సర్‌చార్జ్, సెస్స్ అదనం) వర్తిస్తుంది. ఈ సందర్భంగా ఏబీఎస్ఎల్ఏఎంసీ మేనేజింగ్ డైరెక్టర్ & సీఈవో ఎ. బాలసుబ్రమణియన్ మాట్లాడుతూ, "అపెక్స్ హైబ్రిడ్ లాంగ్-షార్ట్ ఫండ్ ప్రారంభంతో పెట్టుబడిదారులకు అధునాతన సంపద సృష్టి వ్యూహాలను అందిస్తున్నాం. డెరివేటివ్ వ్యూహాలు, పరిమిత షార్టింగ్ సహాయంతో మార్కెట్ అస్థిరతను నియంత్రిస్తూ మెరుగైన రిస్క్-సర్దుబాటు రాబడులను లక్ష్యంగా పెట్టుకున్నాం" అని తెలిపారు.అతని ప్రకారం, ఈ ఫండ్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్లు, ఈక్విటీ సేవింగ్స్ స్కీమ్స్ మధ్య వ్యూహాత్మక స్థానంలో ఉండి, రిటైల్ మ్యూచువల్ ఫండ్లు మరియు ప్రైవేట్ వెల్త్ ఉత్పత్తుల మధ్య మరింత సౌలభ్యంతో కూడిన పెట్టుబడి అవకాశాన్ని అందిస్తుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
12.03.2026 గురువారం, హైదరాబాద్



## పిల్లల్లో వెంట్రుకలు తెల్లబడకుండా చిట్కాలు

తల పరిశుభ్రంగా ఉంచాలి
తలపై దుమ్ము, చెమట ఎక్కువగా ఉండటం వల్ల జుట్టు రూట్స్ బలహీనపడతాయి. క్రమం తప్పకుండా తలస్నానం చేయాలి.







### శివగామిలా ఆశ్చర్యపోయిన రోహిత్..

# సంజు బ్యాటింగ్‌కు ఫిదా!



బాహుబలి-2 సినిమాలో ఇంటర్వెల్ సీన్‌లో భల్లాలదేవ సింహాసనంపై ఉన్న ఛత్రం కింద పడుతుంటే అమరేంద్ర బాహుబలి ఒంటి చేత్తో దాన్ని ఆపేస్తాడు. ఆ దృశ్యాన్ని చూసి శివగామి ఆశ్చర్యంతో కళ్లప్పగించి చూస్తుంది. అలాంటి దృశ్యమే ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన టీ20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో కనిపించింది. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా ఓపెనర్ సంజు శాంసన్ మెరుపు వేగంతో పరుగులు సాధించాడు. భారీ స్కోర్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మైదానంలో సంజు సిక్సర్లు బాదుతూ ఆడుతుంటే గ్యాలరీలో కూర్చొని మ్యాచ్ చూస్తున్న రోహిత్ శర్మ ఆశ్చర్యంగా చూసిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. 2024 టీ20 వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత రోహిత్ శర్మ ఒక ఆటగాడితో మాట్లాడుతూ “ఈ మ్యాచ్‌లో నువ్వు ఆడాల్సి ఉండేది.. కానీ సాధ్యం కాలేదు” అని అన్నట్లు వార్తలు వచ్చాయి. ఆ మాటలను సంజు సీరియస్‌గా తీసుకుని తర్వాత టీ20ల్లో తన ఆటను పూర్తిగా మార్చుకున్నాడు. మొదట న్యూజిలాండ్ సిరీస్‌లో విఫలమైనా, తర్వాత అవకాశం దక్కినప్పుడు సంజు అద్భుతంగా ఆడాడు. జింబాబ్వే, వెస్టిండీస్, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్లపై వరుసగా హాఫ్ సెంచరీలు చేసి జట్టును గెలిపించాడు. ఒకప్పుడు ఫైనల్‌లో ఆడే అవకాశం దక్కని సంజు ఇప్పుడు మ్యాచ్ విన్నర్‌గా మారడం చూసి రోహిత్ శర్మ కూడా ఆశ్చర్యపోయినట్టు కనిపించింది. విజేతల ప్రయాణం కూడా ఇలానే ఉంటుంది. ముందుగా కష్టాలు ఎదురైనా తర్వాత శిఖరాలను చేరుకుంటారు. అచ్చం సంజు శాంసన్ మాదిరిగా.

## అమాయకంగా కనిపించే సంజు శాంసన్.. ఇంతటి కోటీశ్వరుడా?

టీ20 వరల్డ్ కప్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌తో మెరిసిన సంజు శాంసన్ ఒక్కసారిగా జాతీయ స్థాయిలో చర్చనీయాంశమయ్యాడు. మెరుపు వేగంతో వరుసగా మూడు అర్ధశతకాలు సాధించి టోర్నీలో సంచలనం సృష్టించాడు. ముఖ్యంగా ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై చేసిన హాఫ్ సెంచరీతో పాటు వెస్టిండీస్, ఇంగ్లాండ్ జట్లపై చేసిన పరుగులు అభిమానులను ఆకట్టుకున్నాయి. కేరళకు చెందిన సంజు శాంసన్ చాలా సంవత్సరాల క్రితమే జాతీయ జట్టులోకి వచ్చినప్పటికీ స్థిరమైన అవకాశాలు దక్కలేదు. అయితే టీ20 వరల్డ్ కప్‌లో వచ్చిన అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుని తన ప్రతిభను నిరూపించుకున్నాడు. క్రికెట్‌తో పాటు ఆస్తుల విషయంలో కూడా సంజు ముందున్నాడు. అతడి మొత్తం ఆస్తులు దాదాపు రూ.100 కోట్ల వరకు ఉంటాయని సమాచారం. దేశంలోని పలు నగరాల్లో స్థిరాస్తులు, ఖరీదైన వాహనాలు అతడి వద్ద ఉన్నాయి. ఐపీఎల్ ద్వారా వచ్చిన ఆదాయం, బీసీసీఐ మ్యాచ్ ఫీజులను సంజు తెలివిగా స్థిరాస్తుల కొనుగోలుకు వినియోగించినట్టు తెలుస్తోంది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో పెట్టుబడులు పెట్టడంతో అతడి ఆస్తుల విలువ ప్రస్తుతం భారీగా పెరిగింది. ఐపీఎల్, బీసీసీఐతో పాటు ప్రైవేట్ సంస్థల ప్రమోషన్ల ద్వారా కూడా సంజు మంచి ఆదాయం పొందుతున్నాడు.



## టీమిండియా గెలిచినా అసలు టీ20 వరల్డ్ కప్ ట్రోఫీ ఇవ్వరు.. ఇదే ట్విస్ట్

టీమిండియా టీ20 వరల్డ్ కప్ గెలిచి పొట్టి ఫార్మాట్‌లో మరోసారి చరిత్ర సృష్టించింది. వరుసగా రెండోసారి టైటిల్ సాధించిన టీమిండియా మొత్తం మూడోసారి టీ20 ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. దీంతో ఆటగాళ్లపై ప్రశంసల జల్లు కురుస్తోంది. టోర్నీ విజేతగా నిలిచిన టీమిండియాకు ఐసీసీ అధ్యక్షుడు జై షా చేతుల మీదుగా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ట్రోఫీ అందుకున్నాడు. అయితే ఆశ్చర్యకర విషయం ఏమిటంటే టీమిండియాకు ఇచ్చింది అసలు ట్రోఫీ కాదు. ఐసీసీ నిబంధనల ప్రకారం ఏ మెగా టోర్నీలోనైనా విజేత జట్టుకు ఒరిజినల్ ట్రోఫీ ఇవ్వరు. అసలు ట్రోఫీని ఐసీసీ ప్రధాన కార్యాలయంలోనే భద్రంగా ఉంచుతారు. విజేత జట్టుకు మాత్రం దానిని పోలి ఉండే రిప్లికా ట్రోఫీని అందిస్తారు. టీ20 వరల్డ్ కప్ ట్రోఫీ వెండి పూతతో పాటు ఖరీదైన ఖనిజాలతో తయారు చేస్తారు. దీనిపై ప్రత్యేక కోటింగ్ కూడా ఉంటుంది. ప్రారంభంలో ఈ ట్రోఫీ బరువు సుమారు 12 కిలోల వరకు ఉండేది. ఆటగాళ్లు పట్టుకోవడం ఇబ్బందిగా మారడంతో 2021 నుంచి దాని బరువును సుమారు 3.9 కిలోలకు తగ్గించారు. ఈ ట్రోఫీ రూపకల్పనలో భారత స్వర్ణకారుడు అమిత్ బాబూలాల్ కీలక పాత్ర పోషించగా, అంతర్జాతీయ వెండి శిల్పి థామస్ లైట్ దీనికి మరిన్ని అలంకరణలు జోడించారు.వన్డే వరల్డ్ కప్‌లో గోల్డ్ ప్లేటెడ్ ట్రోఫీ ఇస్తే, టీ20 వరల్డ్ కప్‌కు మాత్రం ప్రత్యేకత ఉండాలనే ఉద్దేశంతో ఐసీసీ సిల్వర్ ప్లేటెడ్ ట్రోఫీనే రూపొందించి విజేత జట్టుకు అందిస్తోంది.

## క్రికెటర్ అమిత్ మిశ్రాపై భార్య సంచలన ఆరోపణలు

ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ఆడుతున్న క్రికెటర్ అమిత్ మిశ్రాపై అతడి భార్య గరీమా తివారి సంచలన ఆరోపణలు చేసింది. కాన్పూర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన గరీమా, అమిత్ తనను తీవ్రంగా వేధించాడని పేర్కొంటూ విడాకులు కోరింది. ప్రేమ వివాహం తర్వాత కొంతకాలం సవ్యంగా ఉన్నప్పటికీ, తరువాత అమిత్ ప్రవర్తన మారిపోయిందని ఆమె ఆరోపించింది. అనారోగ్యంగా ఉన్నప్పటికీ శారీరకంగా కలవాలని ఒత్తిడి చేసేవాడని, ఇతర యువతులతో సంబంధాలు కొనసాగించేవాడని తెలిపింది. తన వద్ద ఉన్న చాట్ వివరాలను కూడా కోర్టుకు సమర్పించినట్టు పేర్కొంది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లినా కేసు నమోదు కాలేదని, అందుకే కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని గరీమా తెలిపింది. అమిత్ వేధింపులు తట్టుకోలేక ఒకసారి ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించినట్టు కూడా చెప్పింది. అమిత్ నుంచి విడాకులు ఇవ్వడంతో పాటు కోటి రూపాయలు పరిహారంగా ఇవ్వాలని ఆమె పిటిషన్‌లో కోరింది. ఈ ఆరోపణలపై అమిత్ మిశ్రా ఇప్పటివరకు స్పందించలేదు. ఈ వ్యవహారం జాతీయ మీడియాలో చర్చనీయాంశమైంది.



## ఐపీఎల్‌కు ముందు సన్‌రైజర్స్‌లో కొత్త సంచలనం

టీ20 వరల్డ్ కప్ ముగియడంతో క్రికెట్ అభిమానులు ఇప్పుడు ఐపీఎల్ కోసం ఎదురుచూస్తున్నారు. ఐపీఎల్‌కు సంబంధించిన అప్డేట్లను బీసీసీఐ వరుసగా ప్రకటిస్తోంది. త్వరలోనే పూర్తి షెడ్యూల్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈసారి ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇప్పటికే ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, అభిషేక్ శర్మ వంటి కీలక ఆటగాళ్లు జట్టులో ఉండగా, తాజాగా మరో నలుగురు యువ ఆటగాళ్లపై దృష్టి కేంద్రీకృతమైంది. లివింగ్‌స్టోన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో పాటు ఆఫ్ స్పిన్, లెగ్ స్పిన్ బౌలింగ్ చేయగలడు. డొమెస్టిక్ క్రికెట్‌లో సలీల్ అరోరా వేగంగా పరుగులు సాధిస్తూ ఆకట్టుకున్నాడు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శివాన్ కుమార్ బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లో కూడా మెరుస్తున్నాడు. సౌరాష్ట్రకు చెందిన ప్రఫుల్ ఇంగే 140 కిలోమీటర్ల వేగంతో బంతులు వేస్తూ న్యూ బాల్ స్పెషలిస్ట్‌గా గుర్తింపు పొందాడు.డొమెస్టిక్ క్రికెట్‌లో రాణించిన ఈ నలుగురు యువ ఆటగాళ్లను సన్‌రైజర్స్ కొనుగోలు చేయడంతో, ఈసారి ఐపీఎల్‌లో వారికి అవకాశం లభించే అవకాశముందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.









## ఇషాన్ కిషన్ స్వస్థలంలో ఘన స్వాగతం..

**వరల్డ్ కప్ హీరోకు అభిమానుల సందడి**

టీ20 వరల్డ్ కప్ విజేతగా నిలిచిన టీమిండియాకు దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై భారత్ అద్భుతంగా ఆడి భారీ పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో సంజు శాంసన్, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ అర్ధశతకాలు చేసి జట్టుకు భారీ స్కోర్ అందించారు. ముఖ్యంగా ఇషాన్ కిషన్ దూకుడుగా బ్యాటింగ్ చేస్తూ న్యూజిలాండ్ బౌలర్లపై ఆధిపత్యం చూపించాడు. అతడి ఆటతీరును మాజీ క్రికెటర్లు ప్రశంసిస్తూ, ఈ ఫామ్ కొనసాగితే జట్టులో అతడి స్థానం మరింత బలపడుతుందని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రపంచ కప్ విజయానంతరం ఆటగాళ్లు తమ తమ స్వస్థలాలకు వెళ్లగా, బీహార్‌కు చెందిన ఇషాన్ కిషన్‌కు అక్కడి ప్రజలు ఘన స్వాగతం పలికారు. అతడిని చూడటానికి అభిమానులు భారీగా గుమికూడారు. ఈ దృశ్యాలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. టీ20 వరల్డ్ కప్ విజయంతో ఇషాన్ కిషన్ క్రేజ్ ఒక్కసారిగా పెరిగిందని విశ్లేషకులు అంటున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
12.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## అదే సమస్య అయితే తప్పుకోవాలి: తాప్సీ



బాలీవుడ్‌లో స్టార్ హీరోల వెంట ఉండే సిబ్బంది కారణంగా సినిమాల బడ్జెట్ పెరుగుతోందనే చర్చపై నటి తాప్సీ పన్ను స్పందించారు. ప్రతి హీరో వెంట భారీ టీమ్ ఉంటుందనడం కేవలం అపోహ మాత్రమేనని ఆమె పేర్కొన్నారు. షారుఖ్ ఖాన్, అక్షయ్ కుమార్, అమితాబ్ బచ్చన్ వంటి ప్రముఖ నటులతో పని చేసిన అనుభవంలో వారు చాలా సింపుల్‌గా ఉంటారని తెలిపారు. ముఖ్యంగా షారుఖ్ ఖాన్‌తో పని చేసినప్పుడు ఆయన చుట్టూ పెద్దగా సిబ్బంది ఉండటం తాను చూడలేదని తాప్సీ చెప్పారు. అంత పెద్ద స్టార్లే చాలా సాధారణంగా ఉంటారని, అందరూ అలాగే ఉంటారని అనుకోవడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. నటీనటుల సిబ్బంది ఖర్చులపై నిర్మాతలు ఫిర్యాదులు చేయడాన్ని తాప్సీ ప్రశ్నించారు. నిజంగా అదే సమస్య అయితే అలాంటి కండిషన్లు పెట్టే నటీనటులతో పని చేయకుండా తప్పుకోవాలని అన్నారు. ఒకవైపు అవకాశాలు ఇస్తూ, మరోవైపు బయట విమర్శలు చేయడం సరైంది కాదని స్పష్టం చేశారు.

## నార్త్ అమెరికాలో ‘ఉస్తాద్’ ఊచకోత

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘ఉస్తాద్ భగత్ సింగ్’ చిత్రం మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. శ్రీలీల, రాశి ఖన్నా హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ నిర్మించింది. విడుదలకు ముందే ఈ సినిమాకు విదేశాల్లో మంచి స్పందన లభిస్తోంది. నార్త్ అమెరికాలో ఈ చిత్రాన్ని ప్రత్యంగిరా సినిమాస్ విడుదల చేస్తోంది. ఇప్పటికే అక్కడ ఐదు వేలకుపైగా టికెట్లు అమ్ముడైనట్లు సంస్థ వెల్లడించింది. మార్చి 19 విడుదలకు ముందు రోజు అయిన మార్చి 18న నార్త్ అమెరికాలో ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు. పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన ‘గబ్బర్ సింగ్’ భారీ విజయం సాధించడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ప్రమోషన్లు కొనసాగుతుండగా, త్వరలో భారీ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.



## టాలెంట్ కంటే శరీరాకృతికే ప్రాధాన్యం: సమీరా రెడ్డి



సినిమా ఇండస్ట్రీలో టాలెంట్ కంటే అందం, శరీరాకృతికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారని నటి సమీరా రెడ్డి అన్నారు. హీరోయిన్ల విషయంలో కలర్ డిస్క్రిమినేషన్ కూడా ఉంటుందని, తాను ఇండస్ట్రీలో ఉన్న సమయంలో అలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నానని ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఇండస్ట్రీలో ఉన్నన్ని రోజులు తన నటన కంటే బాడీ సైజు గురించే ఎక్కువగా మాట్లాడేవారని సమీరా రెడ్డి తెలిపారు. మరింత అందంగా కనిపించాలని ముఖంతో పాటు శరీరానికీ మేకప్ వేసుకోవాలని ఒత్తిడి చేసేవారని చెప్పారు. ఆ పరిస్థితులు తనలో ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొన్నారు. పిల్లలు పుట్టిన తర్వాత శరీరంలో వచ్చిన మార్పుల కారణంగా సోషల్ మీడియాలో ట్రోల్స్ ఎదుర్కొన్నానని సమీరా రెడ్డి చెప్పారు. అయితే రెండోసారి తల్లి అయిన తర్వాత తన ఆలోచన విధానం మారిందని, ఇప్పుడు నెగిటివ్ కామెంట్లను పెద్దగా పట్టించుకోవడం లేదని తెలిపారు.

## ‘తథాస్తు’ అంటూ హరీష్ రీ ట్వీట్..

**మండిపడుతున్న మహేష్ అభిమానులు**

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న ‘ఉస్తాద్ భగత్ సింగ్’ విడుదలకు సిద్ధమవుతున్న సమయంలో దర్శకుడు హరీష్ శంకర్ సోషల్ మీడియాలో వివాదంలో చిక్కుకున్నారు. మహేష్ బాబు రికార్డులను ఉద్దేశించి ఒక అభిమాని చేసిన ట్వీట్‌కు హడావిడిలో ‘తథాస్తు’ అంటూ రీ ట్వీట్ చేయడంతో మహేష్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్వీట్ వైరల్ కావడంతో సోషల్ మీడియాలో హరీష్ శంకర్‌పై ట్రోలింగ్ మొదలైంది. పరిస్థితి తీవ్రంగా మారుతుండటంతో హరీష్ శంకర్ వెంటనే ఆ ట్వీట్‌ను తొలగించారు. అనంతరం ఒక నోట్ విడుదల చేస్తూ జరిగిన విషయంపై వివరణ ఇచ్చారు.బిజీ షెడ్యూల్ కారణంగా ఆ ట్వీట్‌ను పూర్తిగా చదవకుండా రీ ట్వీట్ చేశానని హరీష్ శంకర్ తెలిపారు. మహేష్ బాబు పట్ల తనకు ఎంతో గౌరవం ఉందని, తన వల్ల ఎవరి మనోభావాలు దెబ్బతిన్నా క్షమించాలంటూ అభిమానులకు క్షమాపణలు తెలిపారు.



## భర్తకు విడాకులు ఇచ్చిన హన్సిక



స్టార్ హీరోయిన్ హన్సికా మోత్వానీ తన భర్త సోహైల్ కతూరియాతో విడాకులు తీసుకున్నట్లు సమాచారం. ముంబైలోని బాంద్రా ఫ్యామిలీ కోర్టులో పరస్పర అంగీకారంతో వీరిద్దరూ విడాకులు పొందినట్లు తెలుస్తోంది. 2022 డిసెంబర్‌లో రాజస్థాన్‌లో వీరి వివాహం ఘనంగా జరిగింది. వివాహం జరిగిన కొద్ది కాలానికే ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. జీవనశైలి, వ్యక్తిత్వాల విషయంలో పొంతన కుదరకపోవడంతో తరచూ విభేదాలు ఏర్పడ్డాయని సమాచారం. చివరికి కలిసి జీవించడం సాధ్యం కాదని భావించి జూలై 2, 2024 నుంచి వేర్వేరుగా నివసిస్తూ విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. విడాకుల సమయంలో భరణం అంశం చర్చకు వచ్చినప్పటికీ, హన్సికా భర్త నుంచి ఎలాంటి భరణం తీసుకోకుండా ఈ బంధాన్ని ముగించినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ విషయం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.



## ‘విశ్వంభర’లో సీజీపై చోటా కే నాయుడు కీలక వ్యాఖ్యలు

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం ‘విశ్వంభర’లో కంప్యూటర్ గ్రాఫిక్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రముఖ సినిమాటోగ్రాఫర్ చోటా కే నాయుడు తెలిపారు. ప్రస్తుతం సీజీ ఆధారిత సినిమాల్లో కెమెరామ్యాన్ పని కూడా గ్రాఫిక్స్ టీమ్ సూచనల మేరకే జరుగుతుందని ఆయన వెల్లడించారు. సీజీ సినిమాల్లో ప్రత్యేక టెక్నీషియన్ యూనిట్‌తో పాటు మొదటి నుంచి చివరి వరకు ఉంటాడని చోటా కే నాయుడు చెప్పారు. అతడు చెప్పకుండా ఒక్క ఫ్రేమ్ కూడా తీయరని, లైటింగ్ వంటి విషయాల్లో కూడా వారి సూచనలకే ప్రాధాన్యం ఇస్తామని వివరించారు. ‘విశ్వంభర’కు భారీ బడ్జెట్ ఉండటంతో సినిమా అత్యుత్తమంగా రావాలనే ఉద్దేశంతో జాగ్రత్తగా పని చేస్తున్నామని చోటా కే నాయుడు తెలిపారు. అందుకే చిత్రానికి ఎక్కువ సమయం తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

## పాన్ ఇండియా మూవీలో రుక్మిణి వసంత్



కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు దక్షిణాది సినీ పరిశ్రమల్లో వరుస అవకాశాలు లభిస్తున్నాయి. కన్నడలో గుర్తింపు తెచ్చుకున్న ఈ హీరోయిన్ ఇప్పుడు టాలీవుడ్, కోలీవుడ్ పరిశ్రమల్లో భారీ ప్రాజెక్టుల్లో నటిస్తూ మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారుతోంది. తాజా సమాచారం ప్రకారం కోలీవుడ్ నటుడు ధనుష్ నటించనున్న పాన్ ఇండియా సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా ఎంపికైనట్లు తెలుస్తోంది. ‘లబ్బర్ పందు’ సినిమాతో గుర్తింపు పొందిన దర్శకుడు తమిళరసన్ పచ్చముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం. ధనుష్ సొంత బ్యానర్ వండర్‌బార్ స్టూడియోస్, డాన్ పిక్చర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి.ఇక తెలుగులో ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ‘డ్రాగన్’ సినిమాలోనూ రుక్మిణి వసంత్ నటిస్తోంది. అలాగే కన్నడ నటుడు యష్ సరసన ‘టాక్సిక్’ చిత్రంలోనూ కనిపించనుంది. వరుసగా భారీ ప్రాజెక్టుల్లో అవకాశాలు రావడంతో రుక్మిణి వసంత్ క్రేజ్ పెరుగుతోంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com